Follow: @ANNTELUGU

06-10-2025

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 301 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## శ్రీశైలం ఆలయానికి మోదీ

### 16న ప్రధాని విజిట్.. మాస్టర్ ప్లాన్ రెడీ

తిరుమల తరహాలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు

ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్ల అటవీ భూమి కేటాయించేలా కేంద్రానికి విన్నపం

శ్రీశైలం దేవాలయ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

సమీక్షలో తన ఆలోచనల్ని పంచుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రాష్ట్ర పర్యటనకు రానున్న ప్రధాని మోదీతో ఆలయ అభివృద్ధిపై చర్చించనున్న ముఖ్యమంత్రి

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

## వదిలేదేలే...

- జూబ్లీహిల్స్ ట్విస్ట్
- మళ్ళీ రంగంలోకి అజర్



02

## రాజీనామా చేసేదేలే..

- అదంతా గిట్టనివాళ్ళ దుష్ప్రచారం
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం



02


## విజయ్ ర్యాలీ ఘటన ఓ కుట్ర

- స్టాలిన్ సర్కారుపై ఖుష్బూ ఫైర్



02

# కమలంలో కల్లోలం




**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయలోపం.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి కూర్చొనే పరిస్థితి లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది అంటూ నేతలు భగభగలాడారు. బీజేపీ నేతల మధ్య గత కొంత కాలంగా రాజుకుంటున్న అసంతృప్తి ఆదివారం ఒక్కసారిగా భగ్గుమన్నది. తెలంగాణ బీజేపీలో మరోసారి విభేదాలు బాహాటంగా మొహమాటం లేకుండా ప్రదర్శించారు. నేతల మధ్య సమన్వయలోపం బహిర్గతం అయింది. జూబ్లీహిల్స్ బై పోల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఆదివారం హైదరాబాద్‌లోని స్టేట్ ఆఫీస్‌లో రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకత్వం తీరు, పార్టీ నేతల తీరుపై ఎమ్మెల్యేలు, ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం బీజేపీలో చర్చనీయాంశంగా మారింది.

**ఏమిటిది రామచంద్రా?**

రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లిహిల్స్ బైపోల్ తదితర కీలకాంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన

మిగతా 2లో

### క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వాన్నం


కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ నేతల తీరుపై కాటిపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య సమన్వయ లోపం ఏర్పడిందని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి కూర్చోలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ఈ సందర్భంగా ఆయన పార్టీ నేతలను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అలాగే పార్టీ ఆఫీస్‌లో కూర్చొని కార్యక్రమాలు డిసైడ్ చేస్తారు కానీ.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి అధ్వానంగా ఉందని, సమావేశాలకు రావడం, వెళ్లడమే మా పనా?.. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు ఏవీ అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఫైర్ అయినట్లు తెలుస్తుంది.

# హైటెన్షన్

## బీసీ రిజర్వేషన్లపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

డిల్లీకి కాంగ్రెస్ నేతలు.. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సీరియస్ గా తీసుకున్న రేవంత్ సర్కార్

డిల్లీకి వెళ్ళే ముందు సీఎం రేవంత్ తో భేటీ అయిన నేతలు



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. విచారణ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీకి వెళ్లబోతున్నారు. హస్తినలో సీనియర్ న్యాయవాదులను కలవబోతున్నారు. న్యాయపరమైన అంశాలపై సలహాలు, సూచనలు తీసుకోబోతున్నారు కాంగ్రెస్ నేతలు. ఇక బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించేలా సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమైంది. ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తామంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు సంబంధించి రేవంత్ సర్కార్ చాలా సీరియస్ గా ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే జీవో ఇవ్వడం, అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం,

మిగతా 2లో

## టిడిపి అధిష్ఠానానికి తిరువూరు తలనొప్పి

- ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య కోల్డ్ వార్
- టిడిపి కార్యాలయ ప్రారంభానికి హాజరుకాని ఎమ్మెల్యే



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,19,400 |
| 22 క్యారెట్ | 1,09,450 |
| సిల్వర్ (కేజీ) | 1,55,000 |

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,207.17 |
| నిఫ్టీ ↗ | 24,894.25 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.05 | 151.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.05 | 151.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.35 | 160.15 |

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం




### కంది శ్రీనివాస రెడ్డి

- సాత్నాల మండలంలో భారీ చేరికలు
- బీజేపీ, బీఆర్ఎస్ ల నుండి కాంగ్రెస్ లోకి చేరిక
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి

**ఆదిలాబాద్ మహా :** సాత్నాల మండల వాసుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం సాత్నాల మండలం లోని సలాయితాండ లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.సైద్ పూర్, సల్తై తండా, పల్తై తండా, సాస్ తండాలకు చెందిన దాదాపు 90 మంది గ్రామస్తులు బీజేపీ, బీఆర్ఎస్ ల నుండి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నేత రాథోడ్ శామ్ రావు ఆధ్వర్యంలో ఆయనతో పాటు రాథోడ్ దూద్ రావు,మాజీ సర్పంచ్ జన బాయ్, చౌహన్ కలరం, జాదవ్ కిష్టు, రాథోడ్ బీమ్ రావు, అడే దేవిదాస్ లతో

మిగతా 2లో



## నేపాల్‌లో భారీ వర్షా లకు 51 మంది బలి

### అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీ

**మహా :** నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య 51కి చేరింది. తూర్పు నేపాల్ లో గత24 గంటల్లో ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగిపడ్డ ఘటనల్లో ఈ మరణాలు సంభవించాయి. అత్యధికంగా ఇల్లాం జిల్లాలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. సూర్యోదయ, మంగ్సేబంగ్, దేవ్ మై ప్రాంతాల్లోనూ మరణాలు నమోదయ్యాయి.


మిగతా 2లో



## ఉప ఎన్నికలో గెలిచి తీరాలి!

- టీపీసీసీ చీఫ్ అధ్యక్షతన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం
- మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రి తుమ్మల, తదితరులు హాజరు
- గెలుపే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం

02



# కమలంలో కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)

పదాదికారుల సమావేశంలో ప్రధాన ఎజెండా పక్కకు వెళ్ళి పార్టీ పరిస్థితి, నేతల మధ్య నెలకొన్న అసంతృప్తి తదితర అంశాలపైనే చర్చ జరిగింది. కొన్నాళ్ళుగా సరిస్థితి బీజేపీలోని ప్రధాన నేతలు, జిల్లా నేతలు, ప్రజా ప్రజా ప్రతినిధుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైంది. అయితే పరిస్థితి పసిగట్టి ఎక్కడికక్కడే నివారించాల్సిన రాష్ట్ర నాయకత్వం చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో అసమ్మతి, అసంతృప్తి, విబేధాలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. ఆదివారం జరిగిన పదాదికారుల సమావేశంలో ప్రజా ప్రతినిధులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కాటిపల్లి వెంకట రమణారెడ్డిలతో పాటు పలువురు నేతలు పార్టీలో సమన్వయ లోపంపై రాష్ట్ర నాయకత్వాన్ని నిలదీశారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షుడితో పాటు కొంత మంది నేతలతో గత కొంత కాలంగా చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పొసగడం లేదు. దీనిపై గతంలోనే తన నిరసనను ఎంపీ రాష్ట్ర కార్యాలయంలో బహిరంగంగానే వ్యక్తపరిచారు. అయినప్పటికీ రాష్ట్ర నాయకత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ వచ్చింది. మరో వైపు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి గత కొంత కాలంగా స్థానిక నాయకత్వంపై అలకతో ఉన్నారు. దీంతో ఆయన కొన్నాళ్ళుగా పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడకుండా తన నిరసనను రాష్ట్ర నాయకత్వానికి తెలియజేస్తున్నారు. అయితే క్రమశిక్షణ కలిగిన పార్టీగా పేరున్న బీజేపీ నేతలెవరూ పార్టీలో గీత దాటుతున్న వారెవరన్నది గుర్తించి సరిదిద్దే పనిని చేసేందుకు సాహసించడం లేదు. ఇదే అంశంపై ఆదివారం జరిగిన పదాదికారుల భేటీలో రచ్చకు దారి తీసింది. నేతలు ఒకరి వెనుక ఒకరు రాష్ట్ర నాయకత్వంపై ప్రశ్నల వర్షం కురిపించడంతో ఊపిరి సలపని విధంగా నేతల పరిస్థితి తయారైంది. చివరకు సమావేశాన్ని ముగించిన నేతలు మరోసారి స్థానిక ఎన్నికల వ్యూహం, జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక అంశాన్ని చర్చించాలని నిర్ణయించారు. స్థానిక నేతలతో ప్రజా ప్రతినిధులకు ఎదురవుతున్న సమస్యలు, ప్రజా ప్రతినిధులతో స్థానిక నేతలకు ఉన్న విబేధాలపై ఆరా తీసేందుకు త్రీమెన్ కమిటీని వేసిన పార్టీ త్వరలోనే సమస్య పరిష్కారం కోసం సానుకూల నిర్ణయం తీసుకుంది. టీబీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పదవీ బాధ్యతలు స్వీకరించి మూడుమాసాలైనా నేతల మధ్య గోలలు మాత్రం తగ్గలేదని, రామచంద్రా..అంటూ నేతలు మొత్తుకుంటున్నారు.

# శ్రీశైలం ఆలయానికి మోదీ

- 16న ప్రధాని విజిట్.. మాస్టర్ ప్లాన్ రెడీ
- తిరుమల తరహాలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు
- ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్ల అటవీ భూమి కేటాయించేలా కేంద్రానికి విన్నపం
- శ్రీశైలం దేవాలయ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- సమీక్షలో తన ఆలోచనల్ని పంచుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- రాష్ట్ర పర్యటనకు రానున్న ప్రధాని మోదీతో ఆలయ అభివృద్ధిపై చర్చించనున్న ముఖ్యమంత్రి





**అమరావతి, మహా :** శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానాన్ని సమగ్రమైన మాస్టర్ ప్లాన్ తో దివ్య క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఏటా లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దేవాదాయ, అటవీశాఖ అధికారులతో సీఎం చర్చించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం దేవాలయ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయశాఖ, అటవీ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. జ్యోతిర్లింగం, శక్తి పీఠం రెండూ కలిగిన దివ్య క్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీశైలం ఆలయ సమగ్రాభివృద్ధిపై సీఎం చర్చించారు. తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వేర్వేరు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ క్షేత్రానికి వస్తున్న నేపథ్యంలో రద్దీకి తగ్గట్టు వారికి సౌకర్యాలు కల్పించాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల అటవీ భూమిని దేవాదాయశాఖకు కేటాయించేలా కేంద్ర అటవీ మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. అలాగే ఈ నెల 16 తేదీన ప్రధాని మోదీ శ్రీశైల మల్లిఖార్జున స్వామిని దర్శించు కొనేందుకు శ్రీశైలం రానున్న దృష్ట్యా ఆయనతో ఆలయ అభివృద్ధిపై చర్చించాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను సైతం అనుసంధానించేలా ప్రణాళికలు చేయాలని సీఎం సూచించారు. దోర్నాల, సుండిపెంట, ఈగలపెంట తదితర ప్రాంతాల సమీపంలో ఉన్న జాతీయ రహదారులను దేవాలయానికి కనెక్టు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆధ్యాత్మికంగా పర్యాటక ప్రాంతంగా, పర్యావరణ పరంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్ర అభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో సౌకర్యాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న శబరిమల లాంటి దేవాలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేసి శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు.

**రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయంగా శ్రీశైలం అభివృద్ధి**

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలన్నీ అటవీ, గిరులపైనే ఉన్నాయని వారసత్వంగా వచ్చిన ఈ ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుమల తర్వాత అతిపెద్ద ఆలయంగా శ్రీశైలం అభివృద్ధి చెందుతున్నదృష్ట్యా భక్తులకు విస్తృతమైన సౌకర్యాలను కల్పించాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో సరైన పార్కింగ్ సదుపాయాలు కూడా లేవని అన్నారు. భూమి అందుబాటులో లేకపోతే పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు సరైన సౌకర్యాలను కల్పించలేమని.. ఈ నేపథ్యంలో అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి అటవీ మంత్రిత్వశాఖకు ఈ అంశాలను వివరించాలని సూచించారు. ఆయా ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఉన్న అటవీ ప్రాంతాలను కూడా రాష్ట్రప్రభుత్వం సంరక్షిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనం పెంపు, అటవీ ప్రాంతాల అభివృద్ధిపై ఇప్పటికే కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీశైలం పులుల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని దీనికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

# హైటెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డినెన్స్ తీసుకు రావడం వంటి పరిణామాలు జరిగాయి. స్థానిక సంస్థలకు సంబంధించి జీవో నెంబర్ 9 కూడా ఇవ్వడం జరిగింది. 42శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ కేసులు వేశారు. దీనిపై సోమవారం వాదనలు వింటామని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ క్రమంలో దీనిపై అఫిడవిట్ దాఖలు చేసి బలమైన వాదనలు వినిపించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. సుప్రీంకోర్టులో తమ వాదనలను బలంగా వినిపించాలి అనే ఆలోచనతో కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టారు. సుప్రీంకోర్టులో వాదనలకు సంబంధించి సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరపాలని నిర్ణయించారు. 42శాతం రిజర్వేషన్లు ప్రకటించడానికి కారణాలు ఏంటి అనేది న్యాయవాదులకు వివరించి, వారి ద్వారా సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని ఆలోచన చేస్తోంది. గతంలో బీహార్ లో రిజర్వేషన్ల పెంపుదలను సుప్రీంకోర్టు కొట్టివేసిన దాఖలాలు ఉన్నాయి. గతంలో సుప్రీంకోర్టే 50శాతం క్యాప్ విధించింది కాబట్టి క్యాప్ ను అధిగమించి తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం వాదనలు వింటామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్ళే ముందు సీఎం రేవంత్ రెడ్డితో పలువురు నేతలు భేటీ అయ్యారు. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన విధానం తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు.

# ముగిసిన దసరా సెలవులు

## రద్దీగా మారిన విజయవాడ - హైదరాబాద్ హైవే

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** దసరా పండగ సెలవులు ముగియడంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహన రద్దీ నెలకొంది. పల్లెల నుంచి నగరాల వైపు ప్రజలు తిరిగి వెళ్లడం ప్రారంభించడంతో రద్దీ ఏర్పడింది. కార్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి రావడంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రణాళికలు రచించాలి: ఎంపీ డీకే అరుణ

**మహా:** బహిరంగ సభల బాధ్యత పార్టీ జిల్లాల ఇన్‌చార్జ్‌లకి మాత్రమే అప్పగించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక కోసం ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు, ఇన్‌చార్జ్, అబ్జర్వర్‌తో త్రిసభ్య కమిటీతో జిల్లాల వారీగా బహిరంగ సభలకు ప్లాన్ చేయాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. కనీసం 15 జడ్పీ చైర్మన్‌లు గెలవడమే లక్ష్యంగా బీజేపీ హై కమాండ్ ప్రణాళికలు రచించాలని కోరారు. ఎంపీలు ఉన్న చోట స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా.. మిగతా ప్రాంతాల్లో పార్టీ విస్తరణే లక్ష్యంగా ప్రణాళికలు రచించాలని ఎంపీ డీకే అరుణ సూచించారు.

# వదిలేదేలే



## జూబ్లిహిల్స్ ట్విస్ట్

## మళ్ళీ రంగంలోకి అజర్

**హైదరాబాద్, మహా:** జూబ్లిహిల్స్ అసెంబ్లీ సీటును త్యాగం చేయవద్దని మైనారిటీ నేతలు అజారుద్దీన్ పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ కు రంగం సిద్ధమైన వేళ జూబ్లిహిల్స్ బైపోల్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటుచేసుకుంటున్నాయి. అజారుద్దీన్ రూపంలో కాంగ్రెస్ పార్టీకి మళ్ళీ కొత్త సవాల్ షురూ అయిందన్న చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ టికెట్ సొంతం చేసుకోవడానికి అజారుద్దీన్ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవికి న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న అజర్ జూబ్లీహిల్స్ బరిలో నిలవాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. మైనార్టీ నేతలతో పలు సమావేశాలు నిర్వహిస్తూ టికెట్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో జూబ్లీహిల్స్ టికెట్ వదలొద్దని అజార్‌ని మైనార్టీ పెద్దలు సూచించారని సమాచారం.

# బాకీ కార్డులు కాదు.. అవి జూట కార్డులు

## బీఆర్ఎస్ ధోఖా మాటలు ప్రజలు ఎవరు నమ్మరు.. బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్



**మహబూబాబాద్, మహా:** బీఆర్ఎస్ పార్టీ సృష్టించినవి బాకీ కార్డులు కాదు జూట కార్డులు అని మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఆదివారం కొత్తగూడలోని పోలారం గ్రామంలో గంగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, జాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థానిక ఎన్నికల పై ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ... తమ ప్రభుత్వంపై అసూయతో 22 నెలల్లోనే బాకీ కార్డులు సృష్టించేంతగా వారిని కాల్చేస్తున్నది అని, పదేండ్ల పాలనలో ఇంటికో ఉద్యోగం చెబితే ఇచ్చారా..? దళిత ముఖ్యమంత్రి చెబితే చేసారా..? మూడు ఎకరాల భూమి చెబితే ఇచ్చారా..? డబుల్ బెడ్ రూమ్ ఇచ్చారా..? ఏదీ లేదు బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అప్పుల కుప్పలో పడ్డారన్నారు.

**ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ..**

తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఊపిరి పీల్చేలా పని చేస్తోందని, బీఆర్ఎస్ జూట మాటలు... బాకీ మాటలు... ధోఖా మాటలు ప్రజలు ఎవరు నమ్మరని వారిని బండకేసి కొట్టి అధికారం ఇచ్చింది ప్రజలే ఇప్పుడు మళ్లీ వారి జూటా మాటల ఎవరు నమ్మరని, ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని, పెట్టుబడి సహాయానికి రైతులకు రైతు భరోసా అందించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డు పడుతోందని, కామారెడ్డి వేదికగా ఇచ్చిన కుల గణన హామీని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేశామని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ, బీసీలకు రిజర్వేషన్ కల్పించకుండా బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

# టిడిపి అధిష్టానానికి తిరువూరు తలనొప్పి

- ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య కోల్డ్ వార్
- టిడిపి కార్యాలయ ప్రారంభానికి హాజరుకాని ఎమ్మెల్యే

**విజయవాడ, మహా :** టిడిపి అధిష్టానానికి తిరువూరు పంచాయతీ తలనొప్పిగా మారింది. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య కోల్డ్ వార్ నడుస్తుండగా, వీరిద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. స్థానిక ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ లేకుండానే తిరువూరు పార్టీ ఆఫీస్ ప్రారంభించడంపై వారిద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరడంతో ఎంపీ కేశినేని చిన్ని వర్గంపై ఎమ్మెల్యే వర్గం సీరియస్ అయింది. ఎమ్మెల్యే కొలికిపూడి లేకుండానే టిడిపి కార్యాలయం ప్రారంభించడంతో వర్గ విభేదాలు బయటపడ్డాయి. టిడిపి కార్యాలయం ప్రారంభోత్సవంలో కొలికపూడి పాల్గొనక పోవడంపై టిడిపి క్యాడర్లో చర్చనీయాంశంగా మారింది. కార్యకర్తల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. ఎంపీ కేశినేని చిన్ని ,ఎమ్మెల్యే కొలికపూడి మధ్య ఆది నుండీ పోరు నడుస్తుందన్న చర్చ ఉంది. గతంలో తిరువూరు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరు కాలేదు. ఇపుడు మళ్ళీ బయటపడడంతో పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



(మొదటిపేజీ తరువాయి)

పాటు పలువురికి కంది శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ..ఇక్కడి తండాలలో సాగుచేస్తున్న సర్వే నెంబర్ లేని సుమారు 245 ఎకరాలకు ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు సహకారంతో పట్టాలు ఇప్పించడానికి కృషి చేస్తానని తెలిపారు.అంతేకాకుండా ఆయా రైతులకు రైతు భరోసా వచ్చేలా చేస్తానన్నారు. మండలంలోని దౌన బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు సేవ చెయ్యడానికే తాను ఉన్నానన్నారు. ఎవరికి ఏకష్టం వచ్చినా తాను అండగా ఉంటానని హామి ఇచ్చారు. ఆదిలాబాద్ లో మీ ఆత్మీయ బంధువు కంది శ్రీనన్న ఉన్నాడన్న విషయం మర్చిపోవద్దని అన్ని వేళలా తాను తోడుగా ఉంటానన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ఎన్నో మంచి పథకాలు ప్రజలకు అందిస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ , పదేళ్లుగా ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డులు, పేదలకు ఉచిత సన్నబియ్యం , రైతు భరోసా, రుణమాఫీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల దరికి చేరాయన్నారు. స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని జడ్పీటీసీలు, యంపీటీసీలు, సర్పంచ్ లను గెలిపించుకోవాలని కోరారు. ఎవరికి టికెట్ దక్కినా స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అంతా కలిసి సని చేయాలని శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, కొండా గంగాధర్,సామ రూపేష్ రెడ్డి, ప్రశాంత్, బోనగిరి సంటెన్న, అల్చేట్టి నాగన్న, చంద్ర షావు, మోహన్, ఏనుగు రవీందర్ రెడ్డి, క్యాతం శివప్రసాద్,అవినాష్, ఉయికె ఇందిరా సాత్నాల మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ ర్యాలీ ఘటన ఓ కుట్ర



## స్టాలిన్ సర్కారుపై ఖుష్బూ ఫైర్

**చెన్నై, మహా :** తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ర్యాలీలో జరిగిన ఈ దుర్ఘటనపై నటి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ సంచలన ఆరోపణలు చేశారు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, పక్కా ప్రణాళికతో, కావాలనే సృష్టించిన ఘటనగా కనిపిస్తోందని ఆమె ఆరోపించారు. ఈ ఘటనలో డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని ఖుష్బూ విమర్శించారు. విజయ్ ర్యాలీకి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సరైన స్థలం కేటాయించలేదని, దీని వల్లే ఇంత పెద్ద విషాదం జరిగిందని ఆమె ఆరోపించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయినా ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటివరకు మౌనంగా ఉండటం దారుణమని, ఆయన వెంటనే దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు.

# నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తోంది

- టీపోల్ లో రిజర్వేషన్లు నమోదు చేయాలి
- బ్యాలెట్ పత్రాల ముద్రణకు టెండర్లను ఖరారు చేయండి
- కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు




**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్‌కు గడువు సమీపిస్తున్నందున సర్వం సన్నద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. రిజర్వేషన్ల వివరాలను తమ వెబ్‌సైట్ 'టీపోల్'లో నమోదు చేయడంతోపాటు ఆయా పరిశీలనలు చేపట్టాలని సూచించింది. ఇప్పటికే రాష్ట్రంలో వార్డులు, గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలను 'టీపోల్' వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఇటీవల రిజర్వేషన్లను పంచాయతీ రాజ్ శాఖ సిద్ధం చేసి వాటిపై గెజిట్‌లను జారీ చేసింది. ఈ సమాచారాన్ని సైతం వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఎంపీడీవోలు వార్డుల, ఆర్డీవోలు సర్పంచుల, జడ్పీ సీఈవోలు ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లను పొందుపర్చాలి. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల నామినేషన్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేయాలి. సమస్యాత్మక, అతి సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను సందర్శించి అక్కడ వెబ్‌కాస్టింగ్ సౌకర్యాలకు అనువైన ఏర్పాట్లను సిద్ధం చేయాలి. ఇక్కడ అవసరమైన సూక్ష్మ పరిశీలకుల సంఖ్యను సూచించాలి. బ్యాలెట్ పత్రాల ముద్రణకు వెంటనే టెండర్లు పిలవాలి. ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు ఈ నెల 8 మధ్యాహ్నం 2 గంటల్లోగా సీల్డ్ కొటేషన్లను దాఖలు చేసేలా చూడాలి. టెండర్లను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఇతర అధికారుల సమక్షంలో తెరిచి ఖరారు చేయాలి. ఇందుకు సంబంధించిన పత్రాలు, సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా వెల్లడించాలని ఎన్నికల సంఘం కలెక్టర్లను ఆదేశించింది.




# రాజీనామా చేసేదేలే...

## అదంతా గిట్టనివాళ్ళ దుష్ప్రచారం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం

హైదరాబాద్, మహా: ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. రాజీనామా ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. ''నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదు. నేనంటే గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. రాజీనామా అనే ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు'' అని విజ్ఞప్తి చేశారు.పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలలో పదవి పోతుందా? ఉంటాదా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశానుసారం స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే కొందరు ఎమ్మెల్యేలు తమ పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# ఉప ఎన్నికలో గెలిచి తీరాలి!

## టీపీసీసీ చీఫ్ అధ్యక్షతన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం

మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రి తుమ్మల, తదితరులు హాజరు

గెలుపే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నిలపై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఆదివారం టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరై ఈ సందర్భంగా నేతలకు మార్గదర్శక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక డివిజన్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీపీసీసీ.. గెలుపే లక్ష్యంగా పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు టీపీసీసీ చీఫ్ దిశానిర్దేశం చేశారు. సర్వే ఫలితాలు పూర్తిగా కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించినట్లు సమాచారం. ఉప ఎన్నికకు పార్టీ అభ్యర్థి ఎవరనేది అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని, అయితే నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.


# నేపాల్‌లో భారీ వర్షా లకు 51 మంది బలి

(మొదటిపేజీ తరువాయి)

పలువురు గాయపడగా అనేకమంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ సైన్యంతో పాటు పోలీసులు, ఇతర సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల్లోని వానలకు కాఠ్ మాండూ లోయలోని భాగమతి, బిష్ణుమతి సహా పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాల్లోకి వరదనీరు చేరుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని రోడ్లపై ప్రయాణాలు చేయవద్దని ప్రజలను అధికారులు సూచించారు. కాఠ్ మాండూ సహా అనేక జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసి, ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉందని నేపాల్ వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు నేపాల్‌కు అండగా ఉంటామని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు.

# ఇది డిజిటల్ ప్రపంచం

- మహిళలూ బహుపరాక్
- సీపీ వీసీ సజ్జనార్
- ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ
- జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ భేటీ



**హైదరాబాద్, మహా :** డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. "ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. "వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం" అని ఆయన ప్రశంసించారు.

అక్టోబర్ 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

# నగర ప్రజలపై కక్షకట్టిన సీఎం రేవంత్

## సిటీ బస్సు చార్జీల పెంపుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

### ఒక్కసారే రూ.10 పెంచడం దుర్మార్గమన్న కేటీఆర్



**హైదరాబాద్, మహా :** జంట నగరాల్లో సిటీ బస్సు చార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒకేసారి కనీస చార్జీని ఏకంగా 10 రూపాయలు పెంచడం దుర్మార్గమని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో బస్సు చార్జీలు పెంచడం వల్ల ప్రతి ప్రయాణికుడిపై నెలకు అదనంగా 500 రూపాయల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస చార్జీపై ఏకంగా 50 శాతం పెంచడం దారుణమని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల బస్ పాస్ చార్జీలు, టీ24 టికెట్ ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలపైనా భారం మోపుతోందని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం విఫలమవడం వల్లే ఆర్టీసీ దివాళా తీసిందని, ఇప్పుడు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రాజధాని వాసులపై రోజుకు కోటి రూపాయల భారం మోపే ఈ నిర్ణయం, హైదరాబాద్ ప్రజలపై ముఖ్యమంత్రికి ఉన్న కక్షను స్పష్టం చేస్తోందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.



## తూర్పు భాగవతం కళాకారుడునీ సన్మానించిన ఎమ్మెల్యే బేబీ నాయన

**విజయనగరం,మహా:** బొబ్బిలి మండలం,కోమటి పల్లి గ్రామానికి చెందిన బొంతలకోటి శంకరరావు జానపద కళల విభాగంలో పలు అవార్డులు అందుకున్న సందర్భంగా శాసనసభ్యులు బేబీ నాయన. ఈరోజు బొబ్బిలి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో బొంతలకోటి శంకర్రావు గారిని సత్కరించారు. బొంతలకోటి శంకర్రావు ఈసస్ చారిటబుల్ ట్రస్ట్ రాజస్థాన్ వారి భారత్ అవార్డు, కలకత్తా వెల్ రెడ్ ఫౌండేషన్ వారు రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత సాఫల్య పురస్కారం, తెలుగు సంస్కృతి సాహితీ ట్రస్ట్ హైదరాబాద్ వారి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు సంస్కృతి సాహిత్య జాతీయ పురస్కారం తదితర అవార్డులతో సత్కరించారు.



## బిసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

### ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య

**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, 'చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌తో పాటు విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నేతలతో కూడిన అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, బీసీలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఈ పోరాటంలో తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

# 8న జడ్పీటీసీ అభ్యర్థుల ప్రకటన

- ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పన పేర్లను పంపాలని జిల్లా కమిటీలకు పీసీసీ ఆదేశం
- నేడు పరిశీలన, రేపటి సీఎం రేవంత్‌తో జరిగే భేటీలో ఖరారు

**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీ తమ జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను ఈ నెల 8న ప్రకటించనుంది. ఈ అభ్యర్థులను రాష్ట్ర స్థాయిలో పీసీసీ ఖరారు చేయనుంది. ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థుల పేర్లను డీసీసీల స్థాయిలోనే పరిశీలించి ప్రకటించనున్నారు. జడ్పీటీసీ సభ్యులుగా పోటీ చేసేందుకు అర్హులను గుర్తించి ఒక్కో స్థానం నుంచి ముగ్గురి పేర్లతో జాబితాను సోమవారం సాయంత్రానికి పంపాలని ఆయా జిల్లా పార్టీ కమిటీలను పీసీసీ ఆదేశించింది. ఈ విషయంలో ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా మంత్రులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర సీనియర్ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. స్థానికంగా మంచిపేరు, అందరినీ సమన్వయం చేసుకునే నేర్పు కలిగి, పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేసే నాయకుల పేర్లను సూచించాలని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో బీసీల నాయకత్వాన్ని బలపరిచేలా ఈ జాబితాలు ఉండాలని తెలిపింది. కాగా, ఆయా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల నేతృత్వంలో జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశాల్లో ఏకాభిప్రాయంతో ఆమోదించిన పేర్లతో రూపొందించిన జాబితాలు ఇప్పటికే పీసీసీకి చేరినట్లు తెలిసింది. ఇక ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి ఎమ్మెల్యేలు, మండల స్థాయి కమిటీల అభిప్రాయాల మేరకు మూడేసి పేర్లను డీసీసీలకు పంపేలా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ నేతలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం వరకు ఆయా జిల్లాల నుంచి అందిన జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాలను రాష్ట్ర స్థాయిలో పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో సవరించనున్నట్లు తెలిసింది. అనంతరం ఈ నెల 7న పీసీసీ చీఫ్‌తోపాటు ఎన్నికల కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై ఆయా జిల్లాల నుంచి వచ్చిన జాబితాలను పరిశీలించి జాబితాపై నిర్ణయం తీసుకుంటారని పీసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

**పోటీ తీవ్రంగా ఉంటే సంప్రదింపులతో**

జడ్పీటీసీ అభ్యర్థిత్వాలకు పోటీ పడే అభ్యర్థుల మధ్య తీవ్రత ఉన్నట్టు గుర్తించిన స్థానాల నుంచి అవసరమైన పక్షంలో జాబితాలో పేర్లున్న వారిని సంప్రదించి ఖరారు చేయనున్నట్టు తెలిసింది. మొత్తంగా ఈ నెల 8వ తేదీ నాటికి జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసి ప్రకటించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒకవేళ ఏ స్థానాలకైనా ఏకాభిప్రాయం కుదరకపోతే వాటిని పెండింగ్‌లో పెట్టి నామినేషన్ల ఉపసంహరణ గడువు నాటికి సంప్రదింపులు కొనసాగించి అభ్యర్థులను ఖరారు చేయాలని టీ పీసీసీ యోచిస్తున్నట్టు తెలిసింది. ఇక ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకు అభ్యర్థులను సంబంధిత మండల స్థాయి కమిటీల సమన్వయంతో డీసీసీ స్థాయిలోనే ఖరారు చేసి ప్రకటించాలని పీసీసీ సూచించింది. ఇదిలా ఉండగా శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు కోట నీలిమ, ఆత్రం సుగుణ, ప్రధాన కార్యదర్శి అంబటి రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో తెలంగాణ శక్తి అభియాన్ కమిటీ సమావేశమై స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అవలంబించాల్సిన వ్యూహంపై చర్చించిన విషయం తెలిసిందే.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి (కాకా)వెంకటస్వామి



- ఆయన చూపిన మార్గంలో కాంగ్రెస్ ముందుకు నడుస్తోంది: భట్టి విక్రమార్క
- కాకా వెంకటస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న పీసీసీ చీఫ్, మంత్రులు పొన్నం, వివేక్, శ్రీధర్ బాబు, శ్రీహరి

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన దివంగత శ్రీ వెంకటస్వామి (కాకా) నిబద్ధత, సేవలు మరువలేనివని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కొనియాడారు. కాకా జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... కాకా బలహీన వర్గాలకు అండగా నిలిచిన తీరును, వారి అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన కాలంలో కాకా వెంకటస్వామి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యంగా, కార్మిక వర్గాల సంక్షేమం కోసం ఆయన ఎంతో పాటుపడ్డారని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి అహర్నిశలు శ్రమించారని ప్రశంసించారు. ఆయన రాజకీయ ప్రయాణం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, వారి హక్కుల పరిరక్షకుడిగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధన కోసం జరిగిన తొలి, మలి దశ ఉద్యమాలలో కాకా వెంకటస్వామి పోషించిన కీలక పాత్రను భట్టి విక్రమార్క ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత యువతరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. కాకా చూపిన స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. వెంకటస్వామి విగ్రహానికి నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ సీనియర్ నేత జానా రెడ్డి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల బరిలో సనాతన అభ్యర్థులు

### అవిముక్తేశ్వరానంద సరస్వతి

**పట్నా:** ఈ ఏడాది చివరిలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఇందుకోసం ఎలక్షన్ కమిషన్‌తో పాటు, వివిధ పార్టీలు సన్నాహాల్లో మునిగితేలుతున్నాయి. తాజాగా జ్యోతిష్య పీఠానికి చెందిన శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సనాతనుల సత్తాను చాటేందుకు రాబోయే బీహార్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. బీహార్‌లోని బెట్టియాలోని అన్ని నియోజకవర్గాల్లో సనాతన లక్ష్యాలకు కట్టుబడిన అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు అవిముక్తేశ్వరానంద సరస్వతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో తనతో పాటు వారంతా చురుకుగా పాల్గొంటారని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో సామాజిక సమస్యల పరిష్కార లక్ష్యం కలిగి, గో రక్షణతో పాటు సనాతన సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని శంకరాచార్య ఓటర్లను కోరారు. పట్నాలో జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడిన స్వామి అవిముక్తేశ్వరానంద.. గో రక్షణ కేవలం మత విశ్వాసానికి సంబంధించినది మాత్రమే కాదని, సమాజం, సంస్కృతికి పునాది అని స్పష్టం చేశారు. గోవును 'జాతీయ మాత'గా ప్రకటించాలనే డిమాండ్‌తో తాను ఢిల్లీలోని జాతీయ పార్టీలను సంప్రదించానని, కానీ దీనిపై స్పష్టమైన స్పందన రాలేదని అన్నారు. బీహార్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తర్వాత అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని అవిముక్తేశ్వరానంద సరస్వతి తెలిపారు. అయితే ఏదైనా పార్టీ అభ్యర్థి గో సంరక్షణకు కట్టుబడి ఉన్నట్లు చెబుతూ అఫిడవిట్ దాఖలు చేస్తే, ఆ నియోజకవర్గాల్లో, తాము తమ అభ్యర్థిని నిలబెట్టబోమని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలోని బ్రహ్మన్‌పూర్ గ్రామంలో 1969, ఆగస్టు 15న జన్మించిన ఉమా శంకర్ ఉపాధ్యాయ, వారణాసిలోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయంలో శాస్త్రి, ఆచార్య డిగ్రీలను పూర్తి చేశారు. 2003, ఏప్రిల్ 15న దండ్ సన్యాసం తీసుకున్నాక ఆయన స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిగా మారారు. 2022,సెప్టెంబర్‌లో ఆయన జ్యోతిష్య పీఠానికి శంకరాచార్యగా నియమితులయ్యారు. ఆయన గో రక్షణ, సనాతన సంప్రదాయాల పునరుద్ధరణ తదితర అంశాలపై చాలాకాలంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

## అరేబియా తీరంలో అమెరికా ఓడరేవు!

**ఇస్లామాబాద్:** అమెరికాతో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని పాకిస్తాన్ ప్రభుత్వం ఆరాటపడుతోంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో స్నేహానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అరేబియా సముద్రం తీరంలో పాక్ భూభాగంలో భారీ ఓడరేవు(పోర్టు) నిర్మించి, నిర్వహించాలని తాజాగా ట్రంప్‌కు విజ్ఞప్తి చేసింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ జిల్లాలోని పాస్నీ పట్టణంలో ఈ పోర్టు నిర్మించాలని కోరింది. ఇరాన్ భూభాగంలో భారత ప్రభుత్వం నిర్మిస్తున్న చాబహర్ పోర్టుకు సమీపంలోనే పాస్నీ టౌన్ ఉండడం గమనార్హం. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ సలహాదారులు ఇటీవల అమెరికా సీనియర్ అధికారులను సంప్రదించినట్లు తెలిసింది. పాస్నీలో ఓడరేవు కోసం ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. ఈ పట్టణం ఇరాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో ఉంది. వ్యూహాత్మకంగా కీలకమైనది. ఇప్పటికే రూపొందించిన బ్లూప్రింట్ ప్రకారం పాస్నీ పోర్టులో అమెరికా ప్రభుత్వం ఒక టర్మినల్ నిర్మించి, నిర్వహించనుంది. పాకిస్తాన్‌లోని అరుదైన ఖనిజాలను ఇక్కడి నుంచే అమెరికాకు చేరవేస్తారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, అసిమ్ మునీర్ గత నెలలో వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. పాకిస్తాన్‌లో మైనింగ్, ఇంధన రంగాల్లో పెట్టుబడులకు పెట్టాలని ఈ సందర్భంగా అమెరికా కంపెనీలను ఆహ్వానించారు. పాకిస్తాన్‌లో ఉన్న విలువైన ఖనిజ సంపద గురించి ట్రంప్‌కు అసిమ్ మునీర్ ప్రత్యేకంగా వివరించారు. చెక్క పెట్టెలో తీసుకొచ్చిన కొన్ని నమూనాలు కూడా చూపించారు. రక్షణ, సాంకేతిక అవసరాల కోసం పాకిస్తాన్‌తో కలిసి ఖనిజాలను గుర్తించి, వెలికితీయడం కోసం 500 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టడానికి అమెరికా మెటల్స్ కంపెనీ ముందుకొచ్చింది. పాస్నీలోని పోర్టు నిర్మాణం కోసం అమెరికాను పాక్ సర్కార్ కోరడం వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు తెలుస్తోంది. పాస్నీ పోర్టు నుంచి ఖనిజ సంపద ఉన్న పశ్చిమ ప్రావిన్స్‌ల దాకా రైలు మార్గాన్ని అమెరికా నిధులతో నిర్మించాలన్నదే పాక్ ఉద్దేశం.

# రైతుల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం

## వర్షాలతో నష్టం వాటిల్లితే పంట నష్టాన్ని అంచనా వేయలేదు

### ఏ హక్కుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓటు అడుగుతున్నారో చెప్పాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఫైర్




**ఆందోల్, మహా:** రాష్ట్రంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కోరారు. వర్షాలతో పంట నష్టం వాటిల్లితే రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వెయ్యలేదని ఆరోపించారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ నేతృత్వంలో ఆందోల్ మండలం సంగుపేట వద్ద ఓ ఫంక్షన్ హాల్లో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత చంటి ప్రభుతోపాటు చంటి దేవిక బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడారు.. రైతులను ఆదుకోలేదని విమర్శించారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అమలు కానీ హామీలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమైందని తెలిపారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే తీరు..**

ప్రకృతి వనాలు, స్మశానవాటికలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని రామచందర్ రావు ఆరోపించారు. గత పది సంవత్సరాల్లో ఉన్నదంతా బీఆర్ఎస్ దోచుకుంటే మిగిలింది ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటుందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై రాజకీయం చేస్తోందని ఫైర్ అయ్యారు. బీసీల సంక్షేమాన్ని చూడడం లేదని మండిపడ్డారు. బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించింది ప్రధాని నరేంద్ర మోదీ అని చెప్పుకొచ్చారు. బిల్లులు రాక బీఆర్ఎస్ హయాంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే తీరు కొనసాగుతోందని విమర్శించారు. ఏ హక్కుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఓటు అడుగుతున్నారో ప్రజలకు చెప్పాలని బీజేపీ చీఫ్ రామచందర్ రావు ధ్వజమెత్తారు.


ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO : APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు

కావలెను





WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

# వందకు వంద మారణహోమం



- జ్వలిత, 9989198943

పసి మేకలను బందెల దొడ్లో వేసి పెద్దపులుల కాపలా
తెల్లవారుజామున నాలుగు గంటలకే బ్రహ్మీ ముహూర్తం
మా బాల్యం చట్టుబండలు కావడానికి ఓ మంత్రం
గొర్రెల మందలో నేనో గొర్రె పిల్లను
నాకు ర్యాంకుల తోక పెరగట్లేదు
నే చదివింది మెదడుకు చేరక
ముక్కున కరుచుకుని ముచ్చటగా దులిపేయడమే,
మీరు నా చర్మంపై మొలిపించగలిగిన నూరు శాతం బూరు
గడియారంలో అంకెలతో మార్కుల జాబితాల పోటీ
వందకు వంద కోసం అమ్ముడుపోతున్న విలువలు

నేనో పసికూనను
పసిడి కొండలతో కొనలేను విద్యను
వీధి బడి చదువుల్లో నేర్చుకున్న మానవత్వం
కార్పొరేట్ చదువుల్లో మృగ్యమైతే
నాకు మీతో పోటీ సరిపోదు
వేల మందిలో వంద మందికి
మార్కులతో మేధను కొలిచి
వస్తువులుగా బాల్యాన్ని గ్రేడింగ్ చేసి, కొంచెం
కొంచెంగా మా సృజనను కండీషనింగ్ చేసి,
ఓటమిని అంగీకరించలేని
అవిటితనం మాకు అలవర్చి,
సంవత్సరాంతాన మార్కులుగా మనుషుల మూల్యాంకనం,
ఏడాదంతా మీరు చేసిన
సుదీర్ఘ హత్యల రంగం..

మా జీవితాల కొలబద్దల నిర్ణయం
మీకు ఎవరు ఇచ్చారు?
మా ప్రాణాలు తోడే హక్కు మీకు ఎలా వచ్చింది?
మా మెదడులను కేవలం మాంసపు ముద్దలు చేసి
మనుషుల్లో ఏ స్థితి కానీ జడత్వం పోసి టెక్నికల్ గా
సాధించిన ప్రగతి ప్రయోగాలు మా కంటగడితే
నాకు నచ్చడం లేదు
నీ సోకు నాకు నప్పడం లేదు..

మా అయ్యల డబ్బుల సంచులు
మీకు కొమ్ములు మొలిపించి,
మీ అహంకారాన్ని మేము బతికిస్తే విద్యాబోధన
పేరుతో సాగే మీ హింసను
ఆపే చట్టం మాకు తెలుసు
అనేక విశ్వవిద్యాలయాలు అనేక కోర్సులతో అరంగేట్రం
ఐఐటి చదువుల్లో, బయోటెక్నాలజీల్లో మన దేశం
మన భాష మనసూ మానవత్వాల బోధన వద్దా మరి

పేరు గొప్ప ఊరు దిబ్బ
చదువును కొలిచే మీటర్లు,
ర్యాంకుల సాధనకు మీటరు సంపద
ప్రగతికి కొలబద్ద విజయమేనా!
మరి ఆత్మస్థైర్యానికి అర్థం చెప్పేది ఎవరు? ఓటమిలో
నిలబడడం ఎవరు నేర్పాలి? ఫలితాలు వచ్చిన
మరుక్షణం
చిలక పలుకులతో ఊదరగొట్టే మీడియా
మా చేతిని మా నెత్తినే పెట్టే మాయాజాలం..
బతికుంటే బలుసాకు తినొచ్చు
మీ ఖర్ఖానాల్లో మా బాల్యాన్ని బందీ చేయకండి
మా బతుకులు బుగ్గిపాలు చేయకండి
అయ్యవార్లూ... కార్పోరేటర్లకు కూలీలై,
మా వాళ్లకు అరిచేతిలో వైకుంఠం ఆశ చూపడం
ఆపండి

లేదంటే నల్లబల్లలు ఆయుధాలవుతాయి కంప్యూటర్
వైర్లు ఉరితాళ్ళు అవుతాయి హత్య ఆత్మహత్య ఏదైనా
మారణ హోమమే కదా..
మార(రు)ణ హోమాల్లో దేశ భవితను, రేపటి తరాన్ని
సమిధలు చేయకండి.

# సాక్షి సంతకం

## కథ

పొద్దు పొడవక ముందే సావిత్రమ్మకు మెలకువ వచ్చింది. అది అలవాటు. పక్కలోంచి లేవబోతుంటే నడుం 'పట్టేసింది'. వయసు మీద పడ్డాక తన మాట వినని శరీరాన్ని తిట్టుకుంటూ నెమ్మదిగా గోడను ఆసరాగా చేసుకుని లేచి కూర్చుంది. వంటింట్లోకి వెళ్లి, పాత అల్యూమినియం గిన్నెలో రాత్రి మిగిలిన చన్నీళ్లు గటగటా తాగింది. గొంతు తడి ఆరింది కానీ, గుండెల్లో దడ మాత్రం తగ్గలేదు. ఈ రోజు మండలాఫీసుకు వెళ్లాలి. పన్నెండవ సారి.

భర్త రామచంద్రయ్య పోయి ఆరు నెలలు కావొస్తుంది. ఊరి చివర ఉన్న రెండెకరాల మెట్ట పొలం తప్ప ఆస్తిపాస్తులేం మిగల్చలేదు ఆయన. ఉన్నంతకాలం ఎవరి దగ్గరా చెయ్యి చాపకుండా, నిజాయితీగా బతికాడు. ఆ నిజాయితీ ఇప్పుడు సావిత్రమ్మ కడుపు నింపదు. ఆయన పేరు మీద రావాల్సిన పెన్షన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం ఆమె వంతయింది. అన్ని కాగితాలు సరిగ్గా ఉన్నా, ఆఖరిగా వీఆర్వో మూర్తి 'సాక్షి సంతకం' పెట్టాలి. ఆ ఒక్క సంతకం దగ్గరే కథ ఆరు నెలలుగా ఆగిపోయింది. కొడుకు శంకర్ తిరుపతిలో ఏదో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. వాడి జీతం వాడి కుటుంబానికే సరిపోతుంది. "అమ్మా, రెండొందలు పంపిస్తున్నా, సర్దుకో," అని నెలకోసారి ఫోన్ చేస్తాడు. వాడిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, "అన్నీ ఉన్నాయ్ నాయినా, నువ్వు జాగ్రత్త," అని చెప్పి ఫోన్ పెట్టేస్తుంది. కానీ అసలు నిజం వేరు. ఇంట్లో బియ్యం డబ్బా అడుగంటింది. మోకాళ్ల నొప్పులకు వాడే మందుల చీటీ బల్ల మీద దుమ్ము పట్టి ఉంది. ఆ పెన్షన్ డబ్బులు వస్తే కానీ బండి నడవదు.

పాత బట్టల మూటలోంచి ఒకే ఒక్క మంచి చీరను తీసి కట్టుకుంది. బూజు పట్టిన అద్దంలో ముఖం చూసుకుంది. పాలిపోయిన ముఖం, లోతుకుపోయిన కళ్లు, తెల్లబడిన జుట్టు... రామచంద్రయ్య ఉన్నప్పుడు తన ముఖం ఇంత కళావిహీనంగా ఉండేది కాదనిపించింది. కళ్ల చెంగుతో తుడుచుకుని, తలుపు గడియపెట్టి బయటకు వచ్చింది.

బస్టాండుకు రెండు మైళ్ల నడక. చెప్పులు అరిగిపోయి, అందులోని మేకులు అప్పుడప్పుడు పాదాలకు గుచ్చుకుంటున్నాయి. ప్రతి అడుగులోనూ ఒక నిస్సహాయత. బస్సు ఎక్కి కిటికీ పక్కన కూర్చుంది. బస్సు కదులుతుంటే, బయటి చెట్లు, మనుషులు వెనక్కి పరిగెడుతున్నట్టు... తన జీవితంలాగే.

మండలాఫీసు ప్రాంగణంలో అడుగుపెట్టగానే ఒక రకమైన నిర్వేదం ఆవహించింది. పాత భవనం, గోడలకు పట్టిన పాచి, చెట్ల కింద గుంపులు గుంపులుగా జనం, దళారుల కేకలు... అంతా గందరగోళం. మెట్లు ఎక్కి వరండాలోకి వచ్చింది. అక్కడ కూడా జనం. అందరి ముఖాల్లో ఒకటే ఆరాటం, ఎదురుచూపు.

గది నెంబర్ ఏడు. వీఆర్వో మూర్తి కూర్చునే చోటు. తలుపు దగ్గర నుంచే లోపలికి చూసింది. ఫ్యాను గిర్రున తిరుగుతోంది కానీ గాలి మాత్రం రావడం లేదు. బల్ల మీద దస్త్రాల గుట్ట. ఆ గుట్ట వెనుక మూర్తి ముఖం కనపడి కనపడనట్టు ఉంది. సావిత్రమ్మ భయపడుతూనే లోపలికి అడుగుపెట్టింది.

"అయ్యా..." ఆమె గొంతు ఆమెకే వినపడలేదు.
మూర్తి తల ఎత్తకుండానే, "ఏం కావాలి?" అన్నాడు విసుగ్గా.
"అది... నా పేరు సావిత్రమ్మ. మొన్న వచ్చాను కదా అయ్యగారూ... పెన్షన్ కాగితం మీద మీ సంతకం కోసం."
మూర్తి ఇప్పుడు తల ఎత్తి చూశాడు. ఆమెను గుర్తుపట్టినట్టుగా తల ఆడించి, "ఓ నువ్వా... ఆ ఫైల్ ఇంకా నా దగ్గరికి రాలేదు. వచ్చాక చూస్తా. బయట కూర్చో," అన్నాడు.

ఇదే మాట గత రెండు నెలలుగా చెప్తున్నాడు. "ఫైల్ రాలేదు," "సార్ మీటింగ్‌లో ఉన్నారు," "రేపు రా,"... కారణాలు మారుతున్నాయి కానీ, పని మాత్రం జరగడం లేదు. సావిత్రమ్మకు ఏం మాట్లాడాలో తెలియలేదు. గొంతులో ఏదో అడ్డం పడినట్టు అనిపించింది. నిశ్శబ్దంగా బయటకు వచ్చి, వరండాలోని సిమెంట్ బెంచీ మీద కూర్చుంది. ఎండ పెరిగే కొద్దీ, ఆమెలోని ఆశ సన్నగిల్లుతోంది. పక్కనే కూర్చున్న ఒక యువకుడు, "ఏమవ్వా... ఏం పని మీద వచ్చినావ్? ఇక్కడ పని జరగాలంటే దారి వేరే ఉంటుంది," అన్నాడు రహస్యంగా.

సావిత్రమ్మకు అర్థమైంది. కానీ రామచంద్రయ్య బతికున్నప్పుడు ఎప్పుడూ చెప్పేవాడు, "పని కోసం లంచం ఇవ్వడం అంటే మనల్ని మనం అమ్ముకోవడమే సావిత్రి," అని. ఆయన మాటను జవదాటడానికి ఆమె మనసు ఒప్పుకోలేదు.

మధ్యాహ్నం అయ్యింది. ఆఫీసులో జనం తగ్గారు. ఉద్యోగులు భోజనానికి వెళ్లారు. సావిత్రమ్మకు కడుపులో ఆకలి దహిస్తోంది. మంచి నీళ్లు తాగి కడుపు నింపుకుంది. ఎండకు, ఆకలికి కళ్లు తిరుగుతున్నట్టు అనిపించింది. అయినా కదలకుండా అక్కడే కూర్చుంది. ఆమె ఓపికను పరీక్షిస్తున్నట్టుగా కాలం నెమ్మదిగా కదులుతోంది.
మూడు గంటలకు మూర్తి బయటకు వచ్చి టీ తాగి మళ్లీ లోపలికి వెళ్లాడు. సావిత్రమ్మ లేచి మళ్లీ అతని గదిలోకి వెళ్లింది. ఈసారి ఆమె గొంతులో కొంచెం ధైర్యం ఉంది. "అయ్యా, ఆ ఫైల్ మీ బల్ల మీదే ఉంది. ఆ మూల పడి ఉంది చూడండి. దయచేసి ఒక్క సంతకం పెట్టి ఇవ్వండి. బస్సు పోతే మళ్లీ రాత్రికి కానీ ఊరికి బస్సు లేదు."ఆమె మాటలకు మూర్తికి కోపం వచ్చింది. "నీకు నాకన్నా బాగా తెలుసా? ఏ ఫైల్ ఎక్కడుందో నాకు తెలియదా? పెద్ద తెలివైన దానిలా మాట్లాడుతున్నావ్. పోయి బయట కూర్చో. నేను పిలుస్తా," అని గద్దించాడు.

సావిత్రమ్మ కళ్లలో నీళ్లు తిరిగాయి. అవమానంతో కుంగిపోయింది. మౌనంగా వెనక్కి వచ్చేసింది. తన బతుకు ఒక సంతకం కోసం ఇంత చులకన అయిపోయిందా? రామచంద్రయ్య బతికుంటే ఇలా జరిగేదా? ఆయన గొంతు వింటేనే ఊళ్లో పదిమంది లేచి నిలబడేవారు. ఇప్పుడు ఆయన భార్య ఒక గుమాస్తా ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సి వస్తోంది. ఆమె గుండె బరువెక్కింది.
సమయం ఐదు కావొస్తుంది. ఆఫీసు మూసేసే వేళ అయ్యింది. ఒక్కొక్కరే ఫైళ్లు సర్దుకుని బయటకు వెళ్తున్నారు. సావిత్రమ్మలో ఆశ పూర్తిగా చచ్చిపోయింది. ఇక లాభం లేదనుకుని, బరువైన అడుగులతో లేచింది. వెళ్ళిపోదామని అనుకుంటున్నప్పుడు, మనసులో ఏదో తెలియని ధైర్యం వచ్చింది. ఓడిపోయి వెళ్లకూడదు. ఈ రోజు ఏదో ఒకటి తేల్చుకోవాలి.

తిరిగి మూర్తి బల్ల దగ్గరకు వెళ్లింది. అప్పటికి అతను కూడా తన సంచి సర్దుకుంటున్నాడు. ఆమెను చూసి, "ఇంకా ఇక్కడే ఉన్నావా? రేపు రమ్మని చెప్పాను కదా," అన్నాడు విసుగ్గా. సావిత్రమ్మ అతని కళ్లలోకి సూటిగా చూసింది. ఆమె చూపులో ఆరు నెలల నిరీక్షణ, పన్నెండు సార్ల తిరుగుడు, అంతులేని అవమానం... అన్నీ ఉన్నాయి. ఆమె గొంతు పెగలలేదు. కళ్ల నుంచి రెండు నీటి చుక్కలు రాలి, ముడతలు పడిన ఆమె బుగ్గల మీద నుంచి జారాయి. ఆమె ఏడవలేదు, అరవలేదు, బతిమాలలేదు. కేవలం నిశ్శబ్దంగా, నిలకడగా అతని వైపు చూస్తూ నిలబడింది. ఆ చూపుల్లోని నిస్సహాయత, ఆ మౌనంలోని ఆవేదన... బండరాయి లాంటి మూర్తి మనసును ఒక్క క్షణం కదిలించాయి. రోజూ ఎంతో మందిని చూస్తాడు. కానీ ఈ ముసలమ్మ చూపులో ఏదో నిజాయితీ, ఏదో ఆత్మగౌరవం కనిపించాయి. బహుశా తన తల్లి గుర్తుకు వచ్చిందేమో.

ఒక్క క్షణం ఆగి, విసుగ్గా ఆ ఫైళ్ల గుట్ట వైపు చూశాడు. ఆమె చెప్పినట్టుగానే, ఒక మూలన పడి ఉన్న పసుపు రంగు ఫైల్‌ను లాగాడు. దాని మీద 'సావిత్రమ్మ, భర్త: రామచంద్రయ్య' అని రాసి ఉంది. ఫైల్ తెరిచాడు. అన్ని కాగితాలు సక్రమంగానే ఉన్నాయి. చివరన 'సాక్షి' అని ఉన్న చోట ఖాళీగా ఉంది.
ఏమీ మాట్లాడకుండా, పెన్ను తీసుకుని గిరి గీకినట్టు ఒక సంతకం పెట్టాడు. స్టాంప్ తీసి దాని మీద బలంగా గుద్దాడు. ఆ శబ్దానికి గది అంతా ప్రతిధ్వనించింది. ఫైల్‌ను ఆమె వైపు జరిపి, "ఇక వెళ్ళు," అన్నాడు. అతని గొంతులో ఇంకా అధికారమే ఉంది కానీ, ఇందాకటింత కఠినంగా లేదు.

సావిత్రమ్మకు తన కళ్లను తనే నమ్మలేకపోయింది. వణుకుతున్న చేతులతో ఆ ఫైల్‌ను అందుకుంది. సంతకం ఉన్న చోట వేలితో తడిమి చూసుకుంది. అది నిజమే. ఆరు నెలల నరకానికి తెరపడింది. కృతజ్ఞత చెప్పడానికి మాటలు రాలేదు. తల వంచి నమస్కారం పెట్టి, నెమ్మదిగా బయటకు నడిచింది. ఆమె వెళ్తున్న వైపే చూస్తూ ఉండిపోయాడు మూర్తి. అతని ముఖంలో ఏ భావమూ లేదు.

ఆఫీసు బయటకు రాగానే, సాయంత్రపు గాలి ఆమె ముఖాన్ని తాకింది. ఊపిరి పీల్చుకున్నట్టు అనిపించింది. చేతిలో ఉన్న ఫైల్‌ను గుండెలకు హత్తుకుంది. అది కేవలం కాగితం కాదు, ఆమె ఆత్మగౌరవం. ఆమె భర్త నిజాయితీకి దక్కిన చిన్న గెలుపు. బస్టాండు వైపు నడుస్తుంటే, ఆమె కాళ్లకు ఇప్పుడు మేకులు గుచ్చుకోవడం లేదు. నడకలో తెలియని హుందాతనం వచ్చింది.

బస్సులో కూర్చుని చీకటి పడుతున్న ఊరి వైపు చూస్తుంటే, రామచంద్రయ్య నవ్వుతున్న ముఖం కళ్ల ముందు మెదిలింది. పెన్షన్ డబ్బులతో ముందుగా ఆయన ఫోటోకి ఒక దండ కొనాలి, తర్వాత మోకాళ్ల నొప్పులకు మందులు కొనాలి అనుకుంది. ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి... కానీ ఈసారి అవి అవమానంతో వచ్చినవి కావు, చిన్న విజయం సాధించినందుకు వచ్చిన ఆనందభాష్పాలు. ఆ ఒక్క సంతకం ఆమెకు రేపటి మీద భరోసాను ఇచ్చింది.

-భూక్యా గోపినాయక్,
9989159196

# మా ఆవిడ ఇల్లు కడుతుంది

తన బాల్యం నుండి వెంట తెచ్చుకున్న కలను
మాలగా అల్లుకొని ఆమె ఇల్లు కడుతోంది
వచ్చిన అతిథులందర్నీ వరుసగా కూర్చోబెట్టి
తన కలల్ని వడ్డిస్తూ ఇల్లు కడుతోంది

తన కలల్లోంచి లాక్కొచ్చిన నగిషీలనన్నింటిని
ఇంటి చుట్టూతా అలంకరిస్తోంది
తన బంధు మిత్రులందరినీ చప్పట్లు కొట్టి
పిలిచి అణువణువునూ పరిచయం చేస్తోంది

మా ఆవిడ ఇల్లు కడుతుంది
కలలోనూ ఇలలోనూ కడుతూనే ఉంది
కిటికీలకు సూర్యుళ్ళను నేత్రాలుగా
తొడుగుతుంది గోడలకు గుండెల్ని తాపడం
చేస్తుంది

అందాల తారల సొగసులన్నిటినీ హాల్లో
వేలాడదీస్తా నంటోంది
వేకువలో వెన్నెలను తెచ్చి వంటగదిని
అలుకుతానంటోంది
నక్షత్రాలను దింపు కొచ్చి శయ్యా మందిరంలో
వేలాడ దీస్తానంటుంది

మా ఆవిడ ఇల్లు కడుతుంది
ఊహల్ని పైకప్పుకు అద్ది ఊహారేఖలు
అల్మరాలకు తాపడం చేస్తానంటుంది
హాల్లో నుండే అలా బయటికి తొంగి చూస్తే
పక్కపక్కనే మీకు మైమరపు కలిగించే
ఇంద్రప్రస్థం కనిపిస్తుంది

మా ఆవిడకు రాత్రీ పగలూ ఇంటిదే ధ్యాస
పంచభూతాలన్నీ మా ఇంటిని ఆవరించేశాయి
ఇల్లు ఇల్లు అని కలవరించి కలవరించి
మా ఆవిడ తానే ఇల్లుగా మారిపోయింది
ఇప్పుడు ఆ ఇంటి చుట్టూ ఆమే పహరా
కాస్తోంది

మా ఆవిడ ఇల్లు కడుతుంది
ఆ యజ్ఞానికి మేమందరము సమిధలమే
దయచేసి ఆమె తపస్సును ఎవ్వరూ భగ్నం
చేయకండి
మా ఆవిడ ఇల్లు కడుతుంది
అయ్యలారా అమ్మలారా అందరూ వచ్చి
ఆమెను దీవించిపోండి.

-మంచికంటి, 9949535695.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.


# జ్ఞాపకాల కొలిమి

## పుస్తక సమీక్ష

అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, జాతశ్రీ, పి.చంద్, హనీఫ్... కొందరు రచయితలు కొత్తగూడెం సింగరేణి గురించి, అక్కడి కార్మికుల బొగ్గుజీవితాల గురించి కథలు అల్లారు. వస్తు ఎంపికలో, శిల్ప భంగిమలో ఎవరి ప్రత్యేకత వారిదే. స్వర్ణ కిలారి "నల్లబంగారం" చదువుతుంటే వారి దారిలో నడిచినా తనదైన సొంత ముద్ర ఉన్న రచయిత్రిలా అనిపించింది. చేదు, తీపి, వగరు, పులుపు జ్ఞాపకాల్లోంచి తను మాట్లాడిన తీరు ఆశ్చర్యం కలిగించింది. నెమరువేసుకోవటం అంటే దుఃఖాన్ని చల్లపరచటం మాత్రమే కాదు, ఆనందాన్ని వడపోసుకోవటం కూడా అన్న అనుభూతి కనిపించింది. ఈ కథలు రచయిత్రి బాల్యంలోని కొంత అమాయకత్వం, ఇంకొంత భయం, మరికొంత విరక్తిలోంచి మనల్ని సింగరేణి కాలనీలోకి తీసుకెళ్తాయి. అతివల అబలత్వంలోంచి స్త్రీవాదాన్ని, ప్రాంతీయ సూక్ష్మంలోని సజీవనాడుల్ని పట్టి చూపిస్తాయి. ఇరుకైన మానవ సంబంధాల్లోని కుల, మత వ్యత్యాసాల నీడల్ని, బొగ్గుబావుల వ్యతల్లోని సాంస్కృతిక సారాన్ని, కార్మికుల కష్టాల మసిలోంచి అంతుచిక్కని ఆర్థికపరిస్థితుల వ్యసన మరణవాగ్మూలాల్ని పరిచయం చేస్తాయి.
ఇవి రెడీమేడ్ గా అల్లిన కథలు కావు. స్వర్ణ కిలారి మనోనేత్రంలో ఎర్రజీరల్లా, నల్లచారల్లా, తెల్లమొగ్గల్లా భౌతిక, భావ చలనాల్లో చిన్నప్పుడే పురుడుపోసుకున్న నల్లవజ్రాలు. అందుకే ఈ కథలు, కథల్లోని పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు, వాతావరణం, భాష... వాస్తవికతతో కల్మషం లేకుండా ఉన్నాయి. అతిశయోక్తులు, నాటకీయత, కల్పనలు, ఊహలు కనిపించవు. జీవం ఉట్టిపడుతూ, మన కళ్ల ముందు జరిగే నిజాల్లా గుండెపై చిత్తరువుల్లా నిలుస్తాయి. ఉద్వేగాల చప్పుళ్లతో మంచెత్తుతూ పలుచటి తడిపొరతో, బొగ్గుబాయిల వేడి నిట్టూర్పులతో ఆశ్చర్యానికి గురిచేస్తాయి. సమస్యలు, పరిష్కారాల చుట్టూ మాత్రమే తిరగకుండా, పరిస్థితుల్లోంచి తేరుకోలేని అనిశ్చితుల మధ్య నిలబెట్టి ప్రశ్నిస్తాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల్లోంచి సార్వజనీన ప్రాంతీయతను ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తాయి.
తండ్రుల ఆవేశానికి బలైన రెండు కుటుంబాల గురించి చెప్తుంది "దిల్ సే" కథ. అలాగే అపకారికి సైతం ఉపకారం చెయ్యాలని అమ్ములు పాత్ర ద్వారా చూపించి, పెద్దల తప్పులకు పిల్లలు బాధ్యులు కారని నిరూపిస్తుంది. అమ్మకు కాన్సర్ వస్తే తెలిసీ తెలియని వయసులో ఓ పాప పడే మనోవేదన, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే పసిహృదయాన్ని ఆవిష్కరిస్తుంది "జీవగర్ర పుల్ల". "ఇక్కడ ఏదీ నిజం గాదు. ఈ కులం, మతం, దేవుడు, అన్ని అబద్ధం. చావొక్కటే నిజం" అన్న వాస్తవాన్నీ బోధిస్తుంది. ఆప్యాయతను పంచే మేకవన్నెపులిలాంటి అంకుల్ పసిప్రాయంలోనే కాటేయబోతే తప్పించుకుని మనసులో మరణయాతన అనుభవించిన నీరజ కథే "చందమామతో ఒక మాట చెప్పాలి!". అలాగే తన భర్తలోని చీకటి కోణాన్ని తెలుసుకుని, సొంతకాళ్లమీద నిలబడిన భార్యపై లోకం ఎలాంటి నిందలు వేస్తుందో కూడా చెప్తుంది. బోరుబావిలో బండ చాకిరి చేస్తున్నా చాలీచాలని కార్మికుల జీతాలు, తాగుడుకు బానిసచేసి ప్రాణం మీదకు ఎలా తెస్తాయో చూపించే కథే "జల్సా!". తాగుడు మానాలన్న సందేశాన్నిస్తూ ముగుస్తుంది.
లోకానికి మంచిగా కనిపిస్తూ, భార్యల్ని వేధిస్తూ, కుటుంబాన్నీ పట్టించుకోకుండా, అక్రమసంబంధాలు పెట్టుకునే మగాళ్ల బతుకుల్ని బట్టబయలు చేస్తుంది "గద్దరి". అంతేకాదు కుటుంబాన్ని, పరువును గుట్టుగా లాక్కొచ్చే స్త్రీని లోకం ఎలాంటి మాటలంటుందో కూడా కన్నీటి చెమ్మతో తెలియజేస్తుంది. పిల్లలకు పెద్దవాళ్లు పేర్లు పెట్టడం వెనుకున్న వాళ్ల అనుభూతుల జ్ఞాపకాల్లోకి తొంగిచూస్తుంది "నల్ల సింగిడి" కథ. అలాగే నలుపు రంగును తక్కువగా చూసే లోకం పోకడను ఎండగడుతుంది. సొంత ఊరిని, చిన్నప్పటి బడిని చూడాలని టెన్త్ క్లాస్ రీ యూనియన్ కు వెళ్లిన నయనకు స్కూలే కాదు, సొంత ఊరే మాయమైందన్న నిజం తెలియడమే "ఓపెన్ కాస్ట్ సర్జరీ!". "మా గత జీవితాన్ని ఈ నల్లటి దిబ్బల కింద శాశ్వత సమాధి చేసి మాకు జీవితకాలపు వేదనను బోనస్ గా ప్రకటించింది సింగరేణి ఓపెన్ కాస్ట్" అంటూ బొగ్గుదిబ్బైన హృదయంలోంచి స్వర్ణ మూగబోతుంది. ఇలా ఇందులోని పదమూడు కథల్లో ఒక్కో నిజం, ఒక్కో అనుభవం, ఒక్కో తర్కం, ఒక్కో సంఘర్షణ, ఒక్కో సంవేదన కనిపిస్తాయి. మన బాల్యపు పొలిమేరల్లోకి తీసుకెళ్లి స్నేహితుల్ని, బంధువుల్ని, సాంస్కృతిక జీవనాన్ని, పరిసరాల్ని, పరిస్థితుల్ని, భౌగోళిక వాతావరణాన్ని జ్ఞప్తికి తెస్తాయి.





ఏ కథకుడైనా అనుభవాల్లోంచి మాట్లాడేటప్పుడు రియాలిటీని వదలిపెట్టరు. అలాగే కథను చెప్పరు. చూపిస్తారు. ఈ రచయిత్రి కూడా చూసింది, తెలిసింది, విన్నది కథల్లోకి తెచ్చే క్రమంలో కొన్ని చోట్ల ప్రేక్షక పాత్ర వహించింది. మరికొన్ని చోట్ల తనే మాట్లాడింది. ఇంకొన్ని చోట్ల మరొకరితో చెప్పించింది. అందువల్లేమో కథన క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంది. వస్తువు ఎంచుకున్న కథాశిల్పాన్నే నడిపింది. సొంత నిర్మాణ పద్ధతుల్ని ఆశ్రయించలేదు. ఎక్కువ కథలు ఫ్లాష్ బ్యాక్ కథనంలో సాగాయి. అక్కడక్కడా ఉత్తమ పురుషలో నడిచినవీ ఉన్నాయి. ఉత్తమంలోంచి మధ్యమ పురుషలోకి మారిన వైనం కూడా కొన్ని కథల్లో కన్పిస్తుంది. కథకురాలు ఇంకొంత నిర్మాణ నైపుణ్యం మీదుగా వస్తువును నడిపించాల్సిన అవసరాన్ని గుర్తించాల్సి ఉందనిపిస్తుంది.



- డా. ఎ. రవీంద్రబాబు
8008636981

కథల్లోని పాత్రలన్నీ రచయితకు పరిచయమైనవే అన్నట్లు చెప్పడం వల్ల వాటి రూపురేఖా విలాసాలను నిజదృష్టితో మనకు చూపించారు. "జీవగర్ర పుల్ల"లో మటన్ షాపు మస్తానమ్మను వర్ణిస్తూ "పావుల బిళ్ళను కుంకుమల అద్ది పెట్టుకుంటదేమో అన్నంత గుండ్రటి, ఎర్రటి బొట్టుతో. చెవ్వు రంధ్రాలు జారి ఎలాడుతున్న గూడ సెవులకు పడిగెలు, కత్తెరమణీలు, నోట్ల రికాం లేకుండా నమిలే కిళ్ళీ.రెండు కాళ్ళకు కనీసం ఇరవై తులాలుండే వెండి కడాలతో కళ్ళల్లో ముద్రించుకపోయిన రూపం ఆమెది." అంటూ దృశ్యంగా మన కళ్లముందు నిలబెడుతుంది.
సాంస్కృతిక జీవనంలో ప్రధాన పాత్ర వహించేవాటిలో పండుగలు, వంటలు కూడా ఉంటాయి. ఈ కథల్లో రచయిత్రి తన అనుభవాల్లోంచి సున్నుండలు చేయడం, పాలకోవా, పాశం వంటి పిండివంటల తయారీ, వాటి రుచి, వాటితో ముడిపడిన బంధాలను అద్భుతంగా చెప్పారు. కొన్ని కథల్లో కథా నేపథ్యానికి, పాత్రల తీరుకు, సందర్భానికి అనుగుణంగా జ్ఞాన సంబంధమైన జీవన తాత్వికాంశాలను చెప్పే ప్రయత్నం చేసారు. "పున్నాగ పూలంత పరిమళంగా, పాలకోవా ఉన్నంత రుచిగా ఉండదు జీవితం", "తండ్రి అప్పుల్ని పిల్లల మీద వేయచ్చేమోగానీ, తప్పుల్ని పిల్లల మీద రుద్దడం ఇంకో తప్పు చేయడమే..", "చావొక్కటే సత్యం, జీవగర్ర పుల్ల అబద్ధం", "ప్రతి అభివృద్ధి వెనుక జీవన విధ్వంసం ఉంటుంది", "కొన్ని జ్ఞాపకాలు మరణవేదనని మించిన దుఃఖదాయకాలు", "అమ్మ చెడిపోయిన గుడ్లు కనిపెట్టినట్టు బినయ్ లాంటి చెడ్డ అంకుల్స్ ని కనిపెట్టే తరీఖా ఉంటే ఎంత బాగుండు". ఇలాంటి వాక్యాలు కథల మధ్యలో, ముగింపులో చదువరుల జీవితాల్ని దిద్దుకునే దిశగా ఆలోచింపజేస్తాయి.
వర్ణన కథలో భాగమవ్వాలి. కథా వస్తువుకు ప్రాణమవ్వాలి. అలాంటి వర్ణనలే కథకు అందంతోపాటు పాఠకుల్నీ కథలో లీనం చేస్తాయి. సింగరేణి కాలనీలకు సంబంధించిన ఈ కథల్లో "మధ్యాహ్నపు ఎండ బొగ్గుకుప్ప మండినట్టే తలపైన సుర్రు మంటూంది". "నల్లమట్టి తడిసి బొగ్గునీళ్ళ సంద్రమయింది". "పెద్దపెద్ద బొగ్గుపెళ్ళల అగ్గిమంట". "బాయిల పెట్టిన బాంబు ఇంట్ల పేలినట్టు" వంటి వర్ణనలెన్నో అదనపు ఆకర్షణ. మొత్తంగా ఈ "నల్ల బంగారం" కథలు స్వానుభవంలోంచి సహానుభవంలోకి నడిపించే అడుగులు.

**నల్ల బంగారం (కథలు). రచయిత: స్వర్ణ కిలారి.**
**పేజీలు: 157. వెల: 200 రూపాయలు.**
**ప్రతులకు: 9705972222, 9849888773.**



# పగటి కలలు

వర్తమాన నగరం
నీళ్ళల్లో తేలియాడుతున్నా
ప్రవర్ధమానం కావడానికి
భవిష్యత్తు నగరం
శంకుస్థాపనతో మెరిసిపోతున్నది!
ఉన్న నగరం కాలానికి
కాళ్ళుజాపుతుంటే
కొత్త నగరం పగటి కలలు
కంటున్నది!
ఒక నగరం బలిసిందా
వేయి గ్రామాల ఉసురు
పోసుకున్నట్లే!
పల్లెలు పరిఢవిల్లనిదే
దేశానికి వెలుగుజిలుగులెక్కడివి?!
నగరాలు నిర్మించడం
ఏ కాలపు సంస్కృతి?
దేశపు భవిష్యత్తు తాకట్టుబెట్టి
నగరాలను ముస్తాబు చేయడం
అన్నం పెడుతున్న చేతికి
సున్నం రాయడమే!
పల్లెల ప్రగతి లోపిస్తే
నగరాల అందాలు మేడిపండు
మెరుపే!
ఎవరి కలను వాళ్ళు
నిజం చేసుకోవడంలో
ప్రజాస్వామ్యం కరువు
పాలనంటే ప్రజాభీష్టానికి పట్టం
కట్టడం
పల్లెల నగరాల మధ్య దూరం
పెరిగితే
సామాజిక సమానత్వం పగటి కలే!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
9440233261

# దీక్ష సహనానికి ప్రతిరూపం భగీరథ మహర్షి




## చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**మొయినాబాద్ మహా:** దీక్ష సహనానికి ప్రతి రూపం శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం నాడు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో ఉప్పర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమనికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగీరథ మహర్షి మహాజ్ఞానిగా అభివర్ణించారని, పరోపకారానికి పెట్టిన పేరు దీక్ష, సహనానికి ప్రతిరూపం అని తెలిపారు. భగీరథ మహర్షి ఎంత కష్టమైన లెక్క చేయకుండా అనుకున్నవి సాధించాడనీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, అనంతరెడ్డి, శేఖర్ సాగర్, జగన్మోహన్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, జైపాల్ రెడ్డి, చారి, అమరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, సగర సంగం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి

## ఎస్సై వెంకటేష్

**ఆమనగల్లు, మహా :** ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, నిబంధనలు పాటించాలని ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ పేర్కొన్నారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా, బహిరంగ వేదికల ద్వారా, ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని వ్యక్తి, రాజకీయ పార్టీ, కులం, మతం మీద దుష్ప్రచారం, అవమానకర వ్యాఖ్యలు, తప్పుడు వార్తలు, ద్వేష ప్రసంగం చేయడం నిషేధించబడ్డాయని వీటిని చట్టపరమైన నేరాలుగా పరిగణించి క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైనచర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్ గ్రూప్లలో అడ్మిన్ల ద్వారానే సందేశాలు పంపబడేటట్లు చూడాలని గ్రూప్లో ఎలాంటి నేరారోపణలు జరిగిన అడ్మిన్ బాధ్యత అన్నారు. ప్రయాణం చేసేటప్పుడు రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లరాదని, అత్యవసర సమయాల్లో తగిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఓటు కోసం ఏదైనా ఇవ్వడం, తీసుకోవడం నిషేధం అన్నారు. అక్రమ మద్యం కలిగి ఉండడం,పంచడం నేరమని, ప్రశాంతంగా, న్యాయంగా ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరు ప్రభుత్వ శాఖలకు సహకరించాలన్నారు. లంచాలు,బెదిరింపులు డబ్బు లేదా మద్యం పంపిణీ కులం, మతం ఆధారంగాప్రచారం చేయడం వర్గాల మధ్య శత్రుత్వం ప్రేరేపించడం వివరాలు లేకుండా ప్రచార పత్రాలు పోస్టర్లు ముద్రించడం నిషేధం అన్నారు.ఎన్నికల్లో లంచం ఇవ్వడం తీసుకోవడం తప్పుడు వార్తలు పుకార్లు ప్రచారం చేసి ప్రజల్లో కల్లోలం సృష్టించడం నేరం అన్నారు . వివిధ నేరాలకు సంబంధించి రిప్రజెంటేషన్ ఆఫ్ ద పీపుల్ యాక్ట్: 1951,భారతీయ న్యాయ సంహిత, ఎక్సైజ్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్ పై ఆరు కార్లు ఢీ

## సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానితో ఒకటి ఢీ.. పలువురికి గాయాలు

**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ ఔటర్ రింగ్ రోడ్డు పై రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తుండగా కారు డ్రైవర్ హిమాయత్ సాగర్ వద్దా సడన్గా బ్రేక్ వేయడంతో వరుసగా ఆరు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో అవుటర్ రింగ్ రోడ్ లో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఆరు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణించే ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ని క్లియర్ చేశారు.



# ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

**రంగారెడ్డి జిల్లా మహా:** చెట్టుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రానికి చెందిన, గడ్డం గణేష్ (36) తన బంధువు దగ్గర ఇబ్రహీంపట్నం ఉంటున్నాడు. ఉస్మానియా ఆసుపత్రిలో ప్రయివేట్ ఉద్యోగిగా చేసేవాడు. కాగా మృతుడు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని బైపాస్ రోడ్డు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# అధైర్య పడకండి అండగా ఉంటా..

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చిలువేరు అశోక్ అనారోగ్యంతో మరణించగా ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల అనారోగ్యాలతో మరణించిన గణిపాక కుమార్, కొమ్మురా నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆర్థిక సాయం అందజేసి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు మంజూరు చేయించి ఇల్లు కట్టుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామం లోని ఎస్సీ కాలనీకి వెళ్లే దారికి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని నాయకులు, స్థానిక ప్రజానీకం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్ లైన్ లో మాట్లాడి డ్రైనేజ్ అంచనా వేసి తీసుకురావాలని ఆదేశించారు. తదనంతరం హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని వనమాలకనపర్తి గ్రామానికి చెందిన మట్టెడ సుమన్ శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించారు. అలాగే గర్నబెల్లి గ్రామానికి చెందిన రాజారపు రాజు అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ఎంజీఎం మార్చరీ లో ఉన్న వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# సిద్ధాంతాలే ఊపిరి దేశసేవే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్

- వరంగల్ నగరంలో కదం తొక్కిన ఆర్ఎస్ఎస్ కవాతు
- ఘనంగా స్వయం సేవకుల పథసంచలనం
- పాల్గొన్న జిల్లా అధ్యక్షులు, స్వయం సేవకులు




**వరంగల్ మహా;** వరంగల్ నగరంలో స్వయం సేవకుల పథసంచలనం ఘనంగా జరిగింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఆర్ఎస్ఎస్ నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా వరంగల్ నగరంలో పదసంచలన్ స్వయం సేవకులు నిర్వహించారు. ఏవివి కళాశాల మైదానం మొదలుకొని బట్టల బజార్, రామన్నపేట, దుర్గేశ్వరాలయం వీధి, జేపీఎన్ రోడ్, ఎల్లమ్మ బజార్, మట్టెవాడ, ఖిలా వరంగల్ ప్రాంతాల మీదుగా సంఘ కాషాయ ధ్వజాన్ని, భరతమాత చిత్రపటం, సంఘస్థాపకులైన అద్యసర్ సంఘచాలక్ డాక్టర్ హెడ్గేవార్, ద్వితీయ సర్ సంఘచాలక్ గురూజీల చిత్రపటాలను పూలమాలలతో అలంకరించిన వాహనంలో ఘన వేషధారులైన సంఘ స్వయం సేవకుల కవాతు (శోభాయాత్ర) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహానగర సంగచాలక్ డాక్టర్ బందెల మోహన్, సహకార్యవాహ వెలిసోజు వీరలింగం, నగర సంగచాలక్ వెలగా రామ్మోహన్, నగర కార్యవాహ శ్రీరామ్ శివాజీ 350మంది స్వయం సేవకులు గణేష్దారులై (సంఘ యూనిఫామ్ ధరించి) పాల్గొన్నారు. సంఘ అభిమానులు, మహిళలు వేదిక ఏర్పాటు చేసి పుష్పాలు జల్లుతూ, బాణసంచా కాల్చుతూ స్వయం సేవకుల కవాతుకు ఆహ్వానం పలికారు.

అదేవిధంగా వరంగల్ జిల్లా లోని ఖిలా వరంగల్ మండలంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఖిలానగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పథ సంచలన్ లో తూర్పు నియోజకవర్గంలోని బీజేపీ కార్యకర్తలతో పాటు స్వయం సేవక్ గా పాల్గొనటం జరిగింది. ఈ కవాతు దేశమే దైవంగా, సేవే శ్వాసగా, ధర్మమే మార్గంగా భరతమాత సేవ, భారతీయ సంస్కృతి పరిరక్షణకై సాగుతున్న ఆర్ఎస్ఎస్ శతాబ్దగాథ.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి, సమస్త మానవాళికి మార్గదర్శిగా నిలిచింది. వరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ఏకశిలా నగర్ లో ఈ పథ సంచలన్ ఉదయం 10 గం.లకు. ప్రారంభమై జన్మభూమి జంక్షన్, గుండుబావి, చిన్న జంక్షన్, విద్యానగర్ కాలని, ఫోర్ట్ రోడ్, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు, హనుమాన్ జంక్షన్, ఖమ్మం మేయిన్ రోడ్ మీదుగా సుమారు 3 కిలోమీటర్లు 300 మంది గణవేశాలతో స్వయంసేవకులు దేశ భక్తి గీతాలు అలపిస్తూ ఉండగా, ముఖ్య కూడళ్ళలో పురప్రముఖులు, మహిళలు మంగళ హారతులతో పూలతో భగవత్ ధ్వజానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గంట రవికుమార్, ముఖ్య వక్తగా విచ్చేసిన విభాగ్ కార్యవాహ గద్ద రమేష్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ తన శతాబ్ది ఉత్సవాలు దేశ వ్యాప్తంగా ఈ విజయ దశమి నుండి ప్రారంభించిందని, ఆర్ఎస్ఎస్ 1925 విజయ దశమి రోజున నాగ్ పూర్ లో అలా కొద్దిమంది స్వయం సేవకులలో డాక్టర్ కేశరావు బలరామ్ హెడ్గేవార్ ద్వారా ప్రారంభించబడి నేడు కోట్లాది మంది స్వయం సేవకుల ద్వారా దేశంలోనే అతిపెద్ద ఎన్జీవో (నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్) గా గుర్తింపు పొంది తన ఈ 100 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో మూడు సార్లు నిషేదం విధింపబడిన, ఎంతో మంది దేశ భక్తులను తయారు చేసి ఈ భారత మాత సేవలో నిమగ్నమైందని ఈ 100 సంవత్సరాలలో చేసిన సేవా కార్యక్రమాలు, ఉద్యమాలను కొనియాడారు. ఈ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా భారత దేశ ప్రజలందరూ పంచ పరివర్తన్ అనగా కుటుంబ ప్రభోధన్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ, పౌర నియమాలు వీటిపై అవగాహన పెంచుకోవాల్సిందిగా మరియు విధిగా వీటిని భారతదేశ పౌరులందరూ ఆచరించవలసిందిగా తద్వారా మాత్రమే ఈ దేశ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి పౌరుడు భరతమాత సేవకై సంసిద్ధులు కావలసిన అవసరం ఉందని, ఈ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలని తద్వారా హిందూ సమాజం మొత్తం ఒక్కటే అన్న భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మార్గనిర్దేశనం చేసారు. చివరిగా ఈ పథ సంచలన్ (రూట్ మార్చ్) ద్వారా హిందూ జాగరణ శక్తి జాగృతం అయి ఈ దేశంలో సామాజిక సేవా కార్యక్రమాలలో పెద్ద ఎత్తున పాల్గొనే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఖిలా వరంగల్ మండలంలో నిర్వహించిన పథ సంచలన్ లో సుమారుగా 300 మంది గణావేశ దండ సహిత స్వయం సేవకులు వివిధ బస్తీల (డివిజన్ల) పాల్గొని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే దొంతికి మాతృ వియోగం

## పరామర్శించిన వేం నరేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఎంపీ, మేయర్ ఎమ్మెల్యేలు, చైర్మన్లు



**హన్మకొండ మహా;** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఆదివారం మరణించగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని వారి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దొంతి మాధవరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఎంపీ కడియం కావ్య,హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, తో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, రేవూరి ప్రకాష్ రెడ్డి, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరుగుతుందని, జెడ్పిటిసి, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని ప్రకటనలో కలెక్టర్ కోరారు.



# పాంగోలిన్ స్కేల్స్ అక్రమ రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టు

## నలుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్న అధికారులు

**హన్మకొండ మహా;** హనుమకొండ నగరంలో హైదరాబాద్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. అక్రమంగా అలుగు పొలుసులని (పాంగోలిన్ స్కేల్స్) రవాణా చేస్తున్న నలుగురు నిందితులని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మొత్తం 6.53 కిలోల అలుగు పాంగోలిన్ స్కేల్స్ని పోలీసులు సీజ్ చేశారు. నిందితులు అలుగులని వేటాడి వాటి చర్మంపై ఉండే పొలుసులని వేరు చేస్తున్నారని, వీటికి భారీ డిమాండ్ ఉండటంతో ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు, అంతేకాకుండా ఔషధాల తయారీలో ఈ అలుగు పొలుసులని వినియోగిస్తున్నారు. వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం అలుగులని వేటాడటం నేరమని పోలీసులు హెచ్చరించారు. డీఆర్ఐ అధికారులు నలుగురు నిందితులని అదుపులోకి తీసుకొని హనుమకొండ అటవీ అధికారులకు అప్పగించారు.

# కొల్డ్రిఫ్ సిరప్ బ్యాచ్ నెంబర్ 13ను నిలిపి వేయాలి

## రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ బోర్డ్ కీలక నిర్ణయం

**వరంగల్ హన్మకొండ మహా;** రాష్ట్ర వ్యాప్తంగా కొల్డ్రిఫ్ సిరప్ బ్యాచ్ నెంబర్ 13ను తక్ష మే నిలిపి వేయాలని తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ బోర్డ్ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల మధ్య ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దగ్గు మందు సేవించి అనేక మంది చిన్నారులు మృత్యు వాత పడినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో డైయిథిలిన్ గ్లైకాల్ అనే విషపూరితమైన రసాయనాలతో కలుషితమైన టానిక్ గా ప్రచారం కాగా తక్షణమే తెలంగాణా రాష్ట్రంలో 13 ను రద్దు చేయాలంటూ డీసీఏ హెచ్చరిక జారీ చేసింది. ఈ సందర్భంగా ఔషధాన్ని అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



DCA GOVERNMENT OF TELANGANA
DRUGS CONTROL ADMINISTRATION

Press Note

Public Alert – Stop Use Notice

Stop Use Notice Regarding Coldrif Syrup (Batch No. SR-13) Due to Toxic Adulteration

Press Note No. 78/DCA/2025 Date: 04-10-2025

The Drugs Control Administration, Telangana, has been alerted to reports of the tragic deaths of children in Madhya Pradesh and Rajasthan, reportedly linked to the consumption of Coldrif Syrup (Paracetamol, Phenylephrine Hydrochloride, Chlorpheniramine Maleate Syrup), Batch No. SR-13, Mfg. Dt. May-2025, Exp. Dt. April-2027, manufactured by Sresan Pharma, Sunguvarchathiram, Kancheepuram District, Tamil Nadu, which has been allegedly adulterated with Diethylene Glycol (DEG), a toxic substance.

In view of this, the public is hereby cautioned to immediately stop using Coldrif Syrup, Batch No. SR-13, if in possession, and report it to the local Drugs Control Authorities without delay.

The public may also report possession of the said drug directly to the Drugs Control Administration, Telangana, through the toll-free number 1800-599-6969, operational from 10:30 a.m. to 5:00 p.m. on all working days.

DCA Telangana officials are coordinating with the DCA authorities of Tamil Nadu, where the manufacturer Sresan Pharma is located, to track the distribution of the said product batch to Telangana. All Drugs Inspectors and Assistant Directors have been instructed to immediately alert retailers, wholesalers, and hospitals to freeze any stocks of the said product batch if available in the market.

The Drugs Control Administration, Telangana, is taking necessary measures in this regard. The public is urged to exercise caution to prevent any further risk.

Date: 04-10-2025

SHAHNAWAZ QASIM, IPS
DIRECTOR GENERAL

# కవాతులో పాల్గొన్న డాక్టర్ వన్నాల

**వరంగల్ మహా;** వరంగల్ కాశీబుగ్గ నగర్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ కార్యక్రమం వరంగల్ లోని ఓ సిటీ శ్రీ హనుమాన్ దేవాలయం నుండి వివేకానంద కాలేజ్ (కాశీబుగ్గ ) వరకు సుమారుగా 3 కిలో మీటర్ల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో కాశీబుగ్గ సంఘ చలక్ చామర్తి ప్రభాకర్, మహానగర్ కార్యకరని మామిడాల ఇస్తారీ తో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు.



# ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ మహా;** జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జనగామ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల కోసం ఏకాశీల బి ఈ డి కాలేజ్, ఏబీవీ, విబిఐటీ కాలేజీలను అలాగే జనగామ మండలం సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం కోసం స్థానిక గౌతమ్ మాడల్ స్కూల్ ను డిసిపి రాజమహేంద్ర నాయక్,ఏసిపి పండరి చేతన్, సంబంధిత అధికారులతో కలిసి శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ లు ఉండాలని అలాగే స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా పోలీస్ బందోబస్తూ, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎంపీడీఓ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పాల్గొన్నారు,

# వాహనదారులకు కేంద్ర రవాణా శాఖ బిగ్ షాక్

## ఐదుకు మించి చలాన్లు ఉంటే లైసెన్స్ రద్దు.. 45 రోజుల్లోగా చెల్లించకపోతే వాహనం సీజ్

**వరంగల్ మహా;** కేంద్ర రవాణా ముసాయిదా ప్రకటన విడుదల చేసింది. ఇకపై వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని కేంద్ర రవాణా శాఖ హెచ్చరించింది. చలాన్ పడితే రోడ్డుపై వాహనాన్ని పోలీసులు ఆపినప్పుడు చూద్దాంలే అనుకుంటే కుదరదిక ఎందుకంటే ఇక నుంచి 45 రోజుల్లోగా పెండింగ్ చలాన్లు కట్టేయాలని లేదా మీ తప్పేమీ లేకుంటే అప్పీల్ చేసుకోవాల్సి ఉంటుందని అంతకుమించి ఆలస్యం చేస్తే మీ వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవచ్చునని అంతేకాకుండా డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ కాకపోవచ్చునని వెహికల్ పై ఐదుకు మించి చలాన్లు ఉంటే ఏకంగా లైసెన్స్ రద్దు వచ్చునని తెలిపింది. సెంట్రల్ మోటార్ వెహికిల్స్ రూల్స్ 1989లో కేంద్ర రవాణా శాఖ పైన వివరించిన కీలక సవరణలను కూడా ప్రతిపాదించింది. గతంలో చలాన్ల పై చర్యల అంశం సవివరంగా లేకపోవడం వల్ల కొత్తగా పలు కఠిన నిబంధనలను కేంద్ర రవాణా శాఖ తీసుకొచ్చింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫికేషన్ను తాజాగా విడుదల చేసింది. చలాన్ల జారీ, చెల్లింపు, అప్పీల్ చేయడం తదితర అంశాలను డిజిటల్ మానీటరింగ్, ఆటోమేషన్ ఆధారంగా వేగవంతం చేయాలని తెలిపింది. ముఖ్యంగా రూల్స్ ఉల్లంఘిస్తే వాహనదారులకు సంబంధిత అధికారులు మూడు రోజుల్లోగా ఎలక్ట్రానిక్ రూపంలో నోటీసు జారీ చేయాలని, ఫిజికల్ రూపంలో 15 రోజుల్లోగా నోటీసు పంపాలని స్పష్టం చేసింది.

**అభ్యంతరాల స్వీకరణ**

కేంద్ర రవాణా శాఖ ప్రతిపాదించిన ముసాయిదా నిబంధనలపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే దిల్లీలో రహదారి రవాణా మంత్రిత్వశాఖలోని అదనపు కార్యదర్శికి పంపవచ్చని కేంద్రం తెలిపింది. ఈ మేరకు commentsmorth@gov.inకు ఈమెయిల్ కూడా చేయొచ్చని స్పష్టం చేసింది.



# రెడ్డిల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** రెడ్డి కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణం లోని రెడ్డి సంఘ భవనంలో జరిగిన రెడ్డిల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రెడ్డి అభ్యర్థులకు అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు. రెడ్డి కులస్తులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. వారికి ఏ సహాయం చెయ్యడానికైనా తాను ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చెర్మన్ అడ్డి భోజరెడ్డి,గిమ్మ సంతోష్ రావు, సామ రూపేష్ రెడ్డి, కొండా గంగాధర్,ప్రశాంత్,డేరా కృష్ణ రెడ్డి ,రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్ల నారాయణ రెడ్డి కార్యదర్శి గోపిడి రాంరెడ్డి , కోశాధికారి , కిష్టారెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..







### బెల్లంపల్లి మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు

## ప్రభుత్వం పరిష్కరించాలి


**బెల్లంపల్లికి భగీరథ నీటిని వెంటనే విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలి**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించి భగీరథ నీటిని వెంటనే విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కార్మిక సంఘాలఐక్యవేదిక కన్వీనర్ మణిరాం సింగ్, నాయకులు ఏండీ చాంద్ పాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలాపునే గోదావరి, ప్రాణహితలు ఉన్నా స్నానం పక్కన పెడితే తాగే నీళ్లు లేవు అన్నట్టుగా ఉందని బెల్లంపల్లి పరిస్థితి, కార్మికులతో పనులు చేయించుకొని వారి మీద పెత్తనం చేసి అవుట్సోర్సింగ్ కార్మికులే కదా ఏం చేస్తారు అని ప్రభుత్వం భావించినట్టు ఉందని కార్మికులు సమ్మె చేస్తే కానీ అర్థం కాదేమో ప్రభుత్వానికి, దాదాపు ఆరు ఏడు నెలలుగా మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు సమ్మె చేస్తుండగా బెల్లం పల్లి నియోజకవర్గం తోపాటు అడ ప్రాజెక్టు నుండి వచ్చేటువంటి నీటిని పూర్తిగా వారు నిలిపివేశారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించి వారి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, వెంటనే వారు విధుల్లోకి హాజరయ్యేలా చర్యలు తీసుకొని నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.



# వేడుకలకు హాజరైన కంది శ్రీనివాస రెడ్డి







**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అభిమానంతో తనను ఆహ్వానించిన వారి శుభకార్యాలకు ఆయన తన శ్రేణులతో కలిసి హాజరయ్యారు. పలు కళ్యాణ మండపాలలో మిత్రులు, శ్రేయోభిలాషులు అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. పట్టణంలోని ఎస్ టి యు భవన్ లో జరిగిన జైనథ్ మాజీ జడ్పీటీసి తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి మనువడి కేశఖండన మహోత్సవం, శ్రీ షిరిడి సాయి బాబా సత్సంగ్ భవన్ లో ఎల్టీ నిఖిత సచిన్ రెడ్డి కుమార్తె నామకరణం,సిరి బ్యాంక్వెట్ హాల్ లో కంది భవ్యరాణి చందన్ రెడ్డి దంపతుల కుమార్తె కంది రుగ్వేదా నూతన వస్త్రాలంకరణ కార్యక్రమాలలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి కానుకలు సమర్పించారు.ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ,గిమ్మ సంతోష్ రావు, అల్చేట్టి నాగన్న, కొండా గంగాధర్,సామ రూపేష్ రెడ్డి, ప్రశాంత్, డేరా కృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు..

## నేటి ప్రజావాణి రద్దు

**ఆదిలాబాద్, మహా :** గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నాటి ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న 2వ సాధారణ స్థానిక ఎన్నికలు ,ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రత్యేక నియమావళి అమలులో ఉంటుదన్నారు.ఈ నేపథ్యంలో, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయబడిందని ,ప్రజలు దీనిని గమనించి సోమవారం కలెక్టరేట్ కు రాకూడదని ఆయన కోరారు .

# కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా :** బాధలో దుఖంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.ఆప్తులను కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబాలకు , అనారోగ్యంతో బాధ పడుతున్న వారి చెంతకు వెళ్లి పరామర్శించి నేనున్నానంటూ కొండంత భరోసా కల్పిస్తారు. ఆదివారం న్యూ రాంపూర్ గ్రామానికి చెందిన బడాలా కిష్టా రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అతని నివాసనికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం యాపల్ గూడలో మోర అశోక్ ఇటీవల అనారోగ్యంతోమృతి చెందడంతో ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట గిమ్మ సంతోష్ రావు, అల్చేట్టి నాగన్న, కొండా గంగాధర్,సామ రూపేష్ రెడ్డి, ప్రశాంత్, డేరా కృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు..





### పీజీ వైద్య ప్రవేశాల్లో రిజర్వేషన్లలో

## నష్టపోతున్న తెలంగాణ విద్యార్థులు

**సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ**

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. పీజీ వైద్య విద్యా ప్రవేశాల్లో రిజర్వేషన్ లేకపోవడం వల్ల తెలంగాణ విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది పీజీ వైద్య విద్యా ప్రవేశాల్లో తెలంగాణ విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. మేనేజ్ మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్ కల్పించకపోవడం వల్ల వందలాది తెలంగాణ విద్యార్థులు పీజీ సీట్లు కోల్పోతున్నారని హరీశ్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు ఉన్నాయి. వీటిలో 50శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద వెళ్తాయి. మిగిలిన 50శాతం రాష్ట్ర కోటాలో ఉండే సీట్లలో 25 శాతం (సుమారు 450 సీట్లు) మేనేజ్ మెంట్ కోటాగా ఉంటాయి. అయితే ఈ సీట్లలో స్థానిక రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో మొత్తం సీట్లు ఆల్ ఇండియా విద్యార్థులకు వెళ్ళిపోతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. ఏపీలో 85శాతం లోకల్ రిజర్వేషన్ ఉంటే తెలంగాణలో శూన్యం! ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ విద్యార్థులు 382 సీట్లు కోల్పోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రక్షణాత్మక నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని హరీశ్ రావు విమర్శించారు. మేనేజ్మెంట్ కోటా సీట్లలో 85శాతం స్థానిక రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని, ప్రస్తుతం విడుదల చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణం రద్దు చేయాలని, కొత్త జీవో జారీ చేసి, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను రక్షించేలా స్పష్టమైన విధానం రూపొందించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

### 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం

# పోరాడుదాం

**పోరాడి సాధించుకున్న రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తే గుణపాఠం తప్పదు**

**రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ అఖిలపక్ష నాయకులు**



**హైదరాబాద్, మహా:** బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుదామంటూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. అశోకా హోటల్‌లో ఆదివారం జరిగిన అఖిలపక్ష పార్టీల నాయకులు సమావేశమై బీసీ రిజర్వేషన్లపై నమోదైన కేసులపై చర్చించారు. తెలంగాణ బీసీ సంక్షేమ అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో వేసిన కేసులను ఎదుర్కోవడానికి ప్రముఖ అడ్వకేట్లను నియమించాలని చెప్పారు. హైకోర్టులో వెంటనే కేసులు వేయాలని, సుప్రీంకోర్టులో వేసిన కేసుల్లో అన్ని రాజకీయ పార్టీలు ఇంప్లీడు కేసులు వేయాలన్నారు. 'ఎన్నో పోరాటాలు, ఉద్యమాల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు సాధించాం. 50 శాతం సీలింగ్ ఉందని రిజర్వేషన్లు గిట్టని కొందరు ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. బీసీ ప్రజలకు న్యాయమైన వాటా వస్తుందంటే కొందరు కోర్టుకు పోయి అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. అగ్రకులాలకు లేని 50 శాతం సీలింగ్, బీసీలకు ఎందుకు?. బీసీలు పోరాడి సాధించుకున్న రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తే తగిన గుణపాఠం నేర్పుతాం. అనవసరంగా రిజర్వేషన్లను వ్యతిరేకించి గ్రామాల్లో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దు. అగ్రకులాల జనాభా 6 శాతం ఉంటే 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. బీసీలకు ఇంకా అన్యాయం జరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. దీనిని కూడా ఓర్వకపోతే సహించం.' అని హెచ్చరించారు.



## మూఢనమ్మకాల నిరోధక చట్టం కావాలి

**జనవిజ్ఞాన వేదిక**

**ఆదిలాబాద్ మహా:** ప్రజల కోసం, ప్రగతి కోసం, ప్రపంచ శాంతి కోసం సైన్స్ అనే లక్ష్యంతో గత 37సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక అనేక కార్యక్రమాలు చేపడుతోందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా వార్షిక సదస్సుకు ఆయన హాజరయ్యారు. కర్ణాటక మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోనూ మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రజలను మూఢనమ్మకాలు , మోసాల బారి నుండి ఈచట్టం కాపాడుతుందన్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొందరు అతీత శక్తుల పేరుతో అమాయక ప్రజలను వంచించి మోసం చేయడంతో పాటు కొందరి మరణాలకు కారణమవుతున్నారని అలాంటి సంఘటన నుండి అమాయక ప్రజలను కాపాడడానికి ఏకైక మార్గం మూఢనమ్మ కాల నిరోధక చట్టం అని తెలిపారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత సంవత్సర కాలంగా చేసిన కార్యక్రమాలపై సమీక్ష తో పాటు భవిష్యత్తులో చేసే కార్యక్రమాల పై పలు తీర్మానాలు చేసారు. ఈ కార్యక్రమం లో జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు దండ నాయక ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి పెంటపర్తి ఊషన్న, జిల్లా నాయకులు లింగారెడ్డి, సంతోష్ కుమార్, గంగన్న, శ్రీధర్ బాబు, ఆత్రం సంతోష్, మెస్రం రాజు, అమిత్ నాయక్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలో ఇక అభ్యర్థుల కలర్ ఫొటో

- అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలు
- సీరియల్ నెంబర్ ఫాంట్ పెద్దవిగా ఉండేలా ఏర్పాట్లు
- వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

**పట్నా, మహా:** కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. బిహార్‌లో నవంబర్ 22 లోగా అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. తొలిసారిగా ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల పాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వీటికి సంబంధించిన వివరాలను పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది.

**అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు..**

"అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండనుంది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశాం. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నాం. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలుంటుంది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బిహార్ ఓటర్లు కూడా స్వాగతించారని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు.

# ఘనంగా కాకా జయంతి ఉత్సవాలు








**నస్పూర్, మహా:** నస్పూర్ పట్టణంలోనీ ,శ్రీరాంపూర్ ఏరియాలో కాకా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాక అబిమాని, వివేక్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా బిసీ సేల్ సెక్రటరీ బరపటి మారుతి ఆధ్వర్యంలో కాకా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించరు. శ్రీరాంపూర్ ఏరియా ఓసీపీ ప్రాంగణంలో వివిధ యూనియన్ నాయకులు, కార్మికులు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీరాంపూర్ లోని సాయి అందుల దృష్టి పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణి చేశారు. అనంతరం సీసీసీ కార్నర్ వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అ సందర్భంగా పలువురు కాకా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమలలో మంచిర్యాల జిల్లా యుత్ కాంగ్రెస్ సెక్రటరీ తోకల సురేష్ యాదవ్, ఇండ్ల కిరణ్, కుక్క తిరుపతి, లక్ష్మణ్, ప్రవీణ్, మహేష్, శంకర్ పాల్గొన్నారు.

# బిట్‌కాయిన్ సరికొత్త రికార్డ్.. ఆల్‌టైమ్ గరిష్టాలకు చేరిన ధర

అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా.. పెట్టుబడిదారులలో ఆందోళన మొదలైంది. డాలర్ విలువ రోజురోజుకి తగ్గుముఖం పట్టింది. ఈ తరుణంలో బిట్‌కాయిన్ వాల్యూ ఆదివారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకొని.. 1,25,000 డాలర్ల మార్కును దాటింది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం ఒక బిట్‌కాయిన్ విలువ సుమారు రూ. 1.08 కోట్లు. ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ విలువ తాజాగా 1,25,689 డాలర్లకు చేరుకుంది. ఆగస్టు 14న నెలకొల్పిన 1,24,514 రికార్డును సైతం.. ఇప్పుడు అధిగమించింది. ప్రస్తుత పరిస్థితులు బిట్‌కాయిన్ విలువను అమాంతం పెంచే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా అమెరికా స్టాక్‌లలో లాభాలు, బిట్‌కాయిన్ లింక్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోలు పెరిగాయి. ఇటీవల ప్రారంభమైన ప్రభుత్వ షట్‌డౌన్.. డబ్బును సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టేలా చేసింది. మార్కెట్ వర్గాలు దీనిని 'డీబేస్‌మెంట్ ట్రేడ్' అని పిలుస్తున్నారు. "ఈక్విటీలు, బంగారం, పోకీమాన్ కార్డుల వంటి సేకరణలతో సహా అనేక ఆస్తులు ఆల్ టైమ్ గరిష్టాలను తాకాయి. డాలర్ విలువ తగ్గడం.. బిట్‌కాయిన్ విలువ పెరగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు" అని క్రిప్టో ప్రైమ్ బ్రోకరేజ్ సంస్థ ఫాల్కన్‌ఎక్స్ మార్కెట్ల కో హెడ్ జాషువా లిమ్ అన్నారు. సాధారణంగా అక్టోబర్ నెల బిట్‌కాయిన్‌కు అనుకూలమైనది.. దీనిని "అప్‌టోబర్" అని మార్కెట్ నిపుణులు పిలుచుకుంటారు. గత కొన్నేళ్లుగా బిట్‌కాయిన్ పెరుగుతూనే ఉంది. రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని చెప్పడంలో కూడా ఎలాంటి సందేహం లేదని చెబుతున్నారు.








# రెనోలో 3000 మంది బయటకు!

ప్రముఖ ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్.. ప్రపంచవ్యాప్తంగా 3,000 మంది ఉద్యోగులను తొలగించడానికి సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ తొలగింపులకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. రెనాల్ట్ కంపెనీ.. హెచ్ఆర్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగులను తొలగించనుంది. మొత్తం మీద సంస్థ తన మొత్తం ఉద్యోగులలో 15 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ తొలగింపులు సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు.. ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రదేశాలలో కూడా ఉన్నాయి. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగానే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రెనాల్ట్ కంపెనీ 2024 చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 98,636 మంది సిబ్బందిని నియమించింది. ''ఆటోమోటివ్ మార్కెట్‌లోని అనిశ్చితులు.. పోటీ వాతావరణం దృష్ట్యా, మా కార్యకలాపాలను సరళీకృతం చేయడానికి తగిన మార్గాలను పరిశీలిస్తున్నాము. ఇందులో భాగమని లేఆఫ్స్ కూడా చేయడానికి చూస్తున్నట్లు'' రెనాల్ట్ ప్రతినిధి పేర్కొన్నారు. రెనాల్ట్ జూలై ఆర్థిక నివేదిక ప్రకారం.. కంపెనీ ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో 11.2 బిలియన్ యూరోల (13 బిలియన్ డాలర్లు) నష్టాన్ని చవిచూసింది. ఇందులో భాగస్వామి నిస్సాన్‌పై కూడా 9.3 బిలియన్ యూరోల నష్టం ఉంది. కంపెనీ నికర ఆదాయం కూడా 461 మిలియన్ యూరోలకు తగ్గిపోయింది. ఖర్చులు పెరగడం.. పెరుగుతున్న పోటీ వాతావరణం నుంచి ఉత్పన్నమయ్యే వాణిజ్య ఒత్తిళ్లు ఈ తగ్గుదలకు కారణమని సమాచారం.




# హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ టెక్నాలజీ సెంటర్

**హైదరాబాద్:** అమెరికాకు చెందిన బీమా సేవల సంస్థ ది హార్ట్‌ఫోర్డ్ తాజాగా హైదరాబాద్‌లో తమ ఇండియా టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా అధునాతన వర్క్‌స్టేషన్లు, శిక్షణా సదుపాయాలు మొదలైన ప్రత్యేకతలతో దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. డిజిటల్, కృత్రిమ మేథ సామర్థ్యాలను పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడుతుందని చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ పన్నాల తెలిపారు. సుశిక్షితులైన టెక్నాలజీ నిపుణుల లభ్యత, గ్లోబల్ ఇన్నోవేషన్ కేంద్రంగా హైదరాబాద్ పేరొందిన నేపథ్యంలో నగరాన్ని ఎంచుకున్నట్లు చీఫ్ డేటా, ఏఐ, ఆపరేషన్స్ ఆఫీసర్ జెఫ్ హాకిన్స్ తెలిపారు. దాదాపు 200 ఏళ్ల పైగా చరిత్ర గల ది హార్ట్‌ఫోర్డ్‌కి ప్రపంచవ్యాప్తంగా 19 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. అమెరికాలోని హార్ట్‌ఫోర్డ్, షికాగో తదితర ప్రాంతాల్లో టెక్నాలజీ కేంద్రాలు ఉన్నాయి.

# చిన్న బిజినెస్.. పెద్ద మ్యాజిక్!

నేటి రోజుల్లో చిన్న చిన్న వ్యాపార యజమానులందరూ సులభంగా, వేగంగా, సురక్షితంగా పని చేయాలనుకుంటే, ఒక్కసారి ఈ స్మార్ట్ టూల్స్ ప్రయత్నించాల్సిందే!

**పేపర్ ప్లస్ డిజిటల్ మ్యాజిక్**

ఒకప్పుడు నోట్స్ రాస్తే కేవలం కాగితాలకే పరిమితం అయ్యేది. ఒక్క కాగితం మిస్ అయినా, రాసిన మాట, గీసిన డ్రాయింగ్ అంతా మాయం అవుతుంది. ఇప్పుడు 'హుయిన్ డిజిటల్ నోట్‌బుక్'తో ఆ భయం పూర్తిగా తొలగింది. ఇది కేవలం ఒక నోట్‌బుక్ కాదు, పేపర్ ప్లస్ డిజిటల్ టాబ్లెట్. ఇందులో రాసిన ప్రతి అక్షరం, గీసిన ప్రతి లైన్ వెంటనే మీ డివైస్‌లో స్టోర్ అవుతుంది. ఆడియో రికార్డ్ ఫీచర్‌తో, మీ వాయిస్ కూడా నోట్స్‌తో కలిసి రికార్డ్ అవుతుంది. ఒక్క క్లిక్‌తో షేర్ చేసుకోవచ్చు కూడా. పేజీలను మిళితం చేయడం, విడగొట్టడం చాలా సులభం. ముఖ్యమైన విషయాలను హైలైట్ చేయడానికి సులభమైన టూల్స్ కూడా ఉన్నాయి. ధర రూ. 7,105ల ప్యాక్‌లో ఒక హుయిన్ నోట్, ఏ ఐ నోట్ ప్యాడ్, యూఎస్బీ కేబుల్, మాగ్నెటిక్ పెన్ స్లీవ్, రీఫిల్స్, ప్లాస్టిక్ పెన్ నిబ్స్, మార్గదర్శక పుస్తకంతో వస్తుంది.

**ఒక్క కార్డు చాలు!**

ఒకప్పుడు పాత పేపర్ విజిటింగ్ కార్డ్ అంటే స్టేటస్ సింబల్. 'ఇదిగో నా కార్డ్' అంటూ ఇచ్చేసి స్టయిల్ కొట్టేవాళ్లు. కాని, నిజం చెప్పాలంటే ఆ కార్డుల ఫ్యూచర్ బాగుండేది కాదు. రోజుల తరబడి జేబులో మురిగి, కాఫీ కప్పుల కింద నలిగి, చివరికి ఏ డస్ట్‌బిన్‌లోనో ఎండ్ అయ్యేది. అలాంటప్పుడు వాటికోసం అనవసరంగా ఖర్చు ఎందుకు చేయటం. కేవలం, ఒక్క టాప్‌తోనే మీ పేరు, నంబర్, వెబ్‌సైట్, సోషల్ మీడియా అన్నీ ఎదుటివారి మొబైల్‌లో బజ్ అయ్యే మాయ చేస్తుంది ఈ 'టాప్‌మో స్మార్ట్ బిజినెస్ కార్డ్'. ఇందులో చిన్న లోగో, క్యూ ఆర్ కోడ్, లైఫ్‌టైమ్ వాలిడిటీ అన్నీ రెడీ! యాప్ డౌన్‌లోడ్ అనే తలనొప్పి లేదు, 'కార్డులు అయిపోయాయి' అనే టెన్షన్ లేదు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చు కూడా. ధర కేవలం రూ. 599 మాత్రమే!


**పోర్టబుల్ సర్వర్**

స్మాల్ బిజినెస్ ఓనర్స్‌కు కస్టమర్ డేటా, ఫైనాన్స్ రికార్డులు, ప్రాజెక్ట్ ఫైల్స్ అన్నీ రక్షించుకోవాలంటే పెద్ద సర్వర్ అవసరమా? లేనే లేదు! బిజినెస్ డీటైల్స్ అన్నీ ఒకే చోట, సురక్షితంగా ఉంచాలంటే 'అప్రికార్న్ ఏజిస్ ప్యాడ్‌లాక్' బెస్ట్ ఆప్షన్. 480 జీబీ స్టోరేజ్, 256-బిట్ ఎన్‌క్రిప్షన్, రగ్‌డ్ బాడీ, టూ స్టెప్ వెరిఫికేషన్‌తో ఏ ఫైల్ అయినా సేఫ్‌గా స్టోర్ చేస్తుంది. ఇది కేవలం స్టోరేజ్ సర్వర్ మాత్రమే కాదు, చిన్న బిజినెస్‌కి నమ్మకమైన డేటా గార్డు. ఆఫీస్‌లోనైనా, ఇంట్లోనైనా, ట్రావెల్‌లోనైనా సులభంగా ఉపయోగించవచ్చు. చిన్న, పోర్టబుల్ బాడీతో జేబులోనైనా పెట్టుకుని క్యారీ చేయవచ్చు. ఏకకాలంలో డేటా యాక్సెస్, బ్యాకప్, షేర్ అన్నీ సులభం. ధర రూ. 49,325.

## తెగ అప్పులిచ్చేసిన బ్యాంకులు..
# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుదే జోరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బ్యాంకుల రుణ వితరణ గణనీయంగా పెరిగింది. రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రుణాలు 9 శాతం పెరిగి రూ. 27.9 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు క్రెడిట్ బుక్ రూ. 25.6 లక్షల కోట్లుగా నమోదైంది. మరోవైపు, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో రుణ వృద్ధి 15.8 శాతంగా నమోదైంది. రుణాల పరిమాణం రూ. 3.99 లక్షల నుంచి రూ. 4.62 లక్షల కోట్లకు ఎగిసింది. ఇక ఐడీబీఐ బ్యాంకు రుణాలు 15 శాతం పెరిగి రూ. 2 లక్షల కోట్ల నుంచి రూ. 2.3 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం వ్యాపారం 12 శాతం పెరిగింది. రూ. 4.78 లక్షల కోట్ల నుంచి రూ. 5.33 లక్షల కోట్లకు ఎగిసింది. అటు క్యూ2లో యూకో బ్యాంక్ మొత్తం వ్యాపారం 13 శాతం పెరిగి రూ. 5.37 లక్షల కోట్లకు చేరింది. మొత్తం రుణాలు 16.67 శాతం వృద్ధి చెంది రూ. 1.98 లక్షల కోట్ల నుంచి రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి.





# నేపాల్‌లో వరద బీభత్సం

## 28 మంది మృతి

**ఖాట్మండు:** నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఖాట్మండులో భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బాగ్మతి నది ఒడ్డు సమీపాన ఉన్న ప్రజలు ముప్పు బారిన పడ్డారు. వారిని నేపాల్ ఆర్మీ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. గడచిన 36 గంటల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు తెగిపోయాయి. వంతెనలు కొట్టుకుపోయాయి . విపత్తు ప్రమాదాల్లో 28 మంది మృతిచెందారని అధికారులు తెలిపారు. భారతదేశానికి తూర్పున సరిహద్దులో ఉన్న ఇలాం జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో 18 మంది మరణించారని పోలీసు ప్రతినిధి బినోద్ ఘిమిరే తెలిపారు. దక్షిణ నేపాల్‌లో పిడుగుపాటుకు ముగ్గురు మరణించగా, ఉదయపూర్ జిల్లాలో వరదలకు ఒకరు మృతిచెందారని ఆయన తెలిపారు. వరదల కారణంగా 11 మంది కొట్టుకుపోయారని అధికారులు తెలిపారు. విపత్తు సంభవించిన ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రతినిధి శాంతి మహత్ మీడియాకు తెలిపారు.

# ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ముప్పు


**బర్మింగ్‌హామ్:** ఎయిర్ ఇండియా విమానానికి కొద్దిపాటిలో పెను ప్రమాదం తప్పిన ఉదంతం చోటుచేసుకుంది. భారత్‌లోని అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు బయలుదేరిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878 విమానంలో గాలిలో ఉన్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ల్యాండింగ్ కోసం విమానం కిందకు దిగుతున్న సమయంలో దానిలోని అత్యవసర పవర్ యూనిట్ 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్ఏటీ) ఊహించని రీతిలో తెరుచుకుంది. అయితే, పైలట్లు అప్రమత్తమై ఎంతో చాకచక్యంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఏఐ117 విమానంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బర్మింగ్‌హామ్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ఉపక్రమిస్తున్న తరుణంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో విమానంలోని ప్రయాణికులుగానీ, సిబ్బంది ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ఒక ప్రకటన




విడుదల చేస్తూ.. 'అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న ఏఐ117 విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో టర్బైన్ తెరుచుకున్నట్లు మా సిబ్బంది గుర్తించారు. అయితే ఆ సమయంలో విమానంలోని ఇతర వ్యవస్థలన్నీ సాధారణంగానే పనిచేస్తున్నాయి. మొత్తానికి విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది' అని పేర్కొంది. ల్యాండింగ్ అనంతరం విమానంలో నిపుణులతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈ అంతరాయం కారణంగా బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఏఐ114 విమాన సర్వీసును రద్దు చేసినట్లు తెలిపింది. కాగా ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని పేర్కొంది. సంస్థకు ప్రయాణికుల భద్రతే ముఖ్యమని ఎయిర్ ఇండియా మరోమారు స్పష్టం చేసింది.

## ఎట్టకేలకు దిగి వచ్చిన పాక్ సర్కార్..
# పీవోకేతో ఒప్పందం

**ఇస్లామాబాద్:** గత వారం రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చెలరేగుతున్న నిరసనోద్యమాన్ని చల్లార్చేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. మొదటి మిలిటరీని పంపి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించి విఫలమైన షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. చివరకు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేకేజేఏఏసీ)తో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో 25 అంశాలతో కూడిన ఒప్పందం ప్రతిని పాక్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి తారిఖ్ ఫజల్ చౌదరి శనివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. గత నెల 29 నుంచి జరుగుతున్న హింసాత్మక ఘర్షణల్లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 10 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. దీంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు ముజఫరాబాద్‌కు షహబాజ్ షరీఫ్ గత బుధవారం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపారు. వారు జేకేజేఏఏసీ నేతలతో రెండు రోజుల పాటు చర్చలు జరిపి ఒక ఒప్పందానికి వచ్చారు. దీని ప్రకారం పాక్ ప్రభుత్వం పీవోకేలోని ముజఫరాబాద్, పూంచ్‌లలో అదనంగా ఇంటర్మీడియట్, సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డులను ఏర్పాటుచేస్తుంది. అలాగే,



ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు స్థానిక ప్రభుత్వం 15 రోజుల్లోగా హెల్త్ కార్డు అమలుకు నిధులు మంజూరు చేయాలి. పీఓకేలో విద్యుత్ వ్యవస్థను మెరుగుపరచడానికి నిధులు అందించాలి. పీఓకే అసెంబ్లీ సభ్యుల అంశంపై న్యాయ, రాజ్యాంగ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ చర్చించాలి. ఆస్తి బదిలీలపై పన్నును 3 నెలల్లోగా పంజాబ్ లేదా పంఖ్తుఖ్వాలతో సమానంగా తీసుకురావాలి. ఈ ఒప్పందాన్ని పర్యవేక్షించి అమలుచేయడానికి ఓ కమిటీని కూడా ఏర్పాటుచేస్తారు.

# శబరిమల టీడీబీ కేసు..

## అది బంగారం కాదు రాగి: ఉన్నికృష్ణన్

**తిరువనంతపురం:** శబరిమల బంగారు పూత వివాదంలో విజిలెన్స్ ముందు ఆరోపణలను ఉన్నికృష్ణన్ పొట్టి ఖండించారు. అంతకుముందు చెప్పినట్టే తన ప్రకటనను పునరావృతం చేస్తూ తనకు అందినవి రాగి పలకలని చెప్పాడు. ఉన్నికృష్ణన్ పొట్టి ప్రకారం.. అధికారుల పొరపాటు వల్ల ఈ సంఘటన జరిగింది. పత్రాలలో నమోదు చేయబడినట్లుగా అధికారులు రాగి పలకలను అందజేశారని, అధికారిక తప్పిదానికి తనను ఎందుకు నిందిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా దేవస్థానం మాన్యువల్ గురించి తనకు తర్వాతే తెలిసిందని పొట్టి అన్నారు. దేవస్థానం విజిలెన్స్ నిన్న ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఉన్నికృష్ణన్ పొట్టిని దాదాపు నాలుగు గంటల పాటు విచారించారు. దర్యాప్తుకు తాను పూర్తిగా సహకరించానని , విచారణ బృందం అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చానని ఆయన మీడియాకు తెలిపారు. ఎస్పీ సునీల్ కుమార్ నేతృత్వంలో ఈ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అయితే , పొట్టి ప్రకటనలు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డును క్లిష్ట పరిస్థితిలో ఉంచాయి. ఆలయం నుండి అప్పగించబడిన రాగి షీట్లు అని ఆయన ప్రధాన వాదనగా ఉంది. ఇది.. 1999లో UB గ్రూప్ చైర్మన్ విజయ్ మాల్యా బంగారు పూత పూసినట్లు నిర్ధారించబడిన రికార్డులకు విరుద్ధంగా



ఉంది. ద్వారపాలక శిల్పాల నుండి వచ్చిన అసలు బంగారు పూత పూసిన ప్యానెల్‌కు ఏం జరిగిందో బోర్డు ఇంకా స్పష్టం చేయలేదు. ఇంతలో ఈ కేసుపై ప్రాథమిక విచారణ నిర్వహించడంపై పోలీసులు న్యాయ సలహా కోరుతున్నారు. అనుమతి లభించిన తర్వాత పతనంతిట్ట పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ప్రాథమిక దర్యాప్తు ప్రారంభమవుతుంది. శబరిమలలో బంగారం దుర్వినియోగంపై కేరళలోని ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వస్తుండటంతో ఈ అంశంపై సంపూర్ణ దర్యాప్తునకు ఆదేశించాలని హైకోర్టుకు వెళ్లనున్నట్లు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ శనివారం ప్రకటించారు. శబరిమల ఆలయానికి బంగారు తాపడం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై ప్రశాంత్ స్పందిస్తూ.. బోర్డును రాజకీయాల్లోకి లాగటానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

## నెలల కొడుకును డ్రమ్‌లో ముంచి
# చంపిన తండ్రి.. ఆ తర్వాత ఆత్మహత్య

**ముంబై:** ఒక వ్యక్తి నాలుగు నెలల కుమారుడ్ని డ్రమ్‌లో ముంచి చంపాడు. ఆ తర్వాత ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు కొన్ని రోజుల ముందు భార్యాభర్తలు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తల్వాడ గ్రామానికి చెందిన అమోల్ సోనావానే శనివారం తన బిడ్డను కడతేర్చాడు. నీలిరంగు డ్రమ్‌లో సగం వరకు ఉన్న నీటిలో నాలుగు నెలల కుమారుడ్ని ముంచి చంపాడు. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. అమోల్, అతడి బిడ్డ మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు రెండు రోజుల కిందట ఇంట్లో గొడవల వల్ల భార్యాభర్తలు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. పొరుగువారు సకాలంలో వారిని రక్షించినట్లు చెప్పారు. ఆ దంపతులు గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని వెల్లడించారు. ఆ తర్వాత అమోల్ తన నెలల కుమారుడ్ని డ్రమ్‌లో ముంచి చంపి ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు.



# 8న బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ రాక

**న్యూఢిల్లీ:** బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్‌లో పర్యటించబోతున్నారు. ఈ నెల 9న ముంబైలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన సమావేశమవుతారు. విజన్-2035 రోడ్‌మ్యాప్‌లో భాగంగా భారత్, యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి చేపట్టిన చర్యల పురోగతిని వారు సమీక్షిస్తారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చిస్తారు. ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో స్టార్మర్ ప్రసంగిస్తారు. స్టార్మర్ గత ఏడాది జూలైలో బ్రిటిష్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఆయన భారత్‌లో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి.

# నేషనల్ క్రష్ గురించి ఎక్కువగా ఆలోచించను: రుక్మిణీ వసంత్



కాంతార చాప్టర్ 1 విడుదల తర్వాత రుక్మిణీ వసంత్ (Rukmini Vasanth) పేరు పాన్ ఇండియా రేంజ్‌లో ట్రెండ్ అవుతుంది. అందుకు ప్రధాన కారణం ఆమె అందంగా ఉండటమే కాకుండా తన నటన, అభినయంతో ప్రేక్షకులను మెప్పించింది. ఏకంగా శాండల్‌వుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ముద్ర వేసింది. కాంతార సినిమా చూసిన వాళ్లు అందరూ ఆమెనే నేషనల్ క్రష్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. పుష్ప సినిమా తర్వతా రష్మిక మందన్నకు దక్కిన గుర్తింపే రుక్మిణీకి దక్కుతుంది. ఆపై వీరిద్దరూ కూడా కన్నడ నుంచే రావడం విశేషం. తనను నేషనల్ క్రష్ అని పిలువడంపై రుక్మిణీ వసంత్ రియాక్ట్ అయింది.

ఇటీవల శివకార్తికేయన్ సరసన 'మదరాసీ'లో మెప్పించిన రుక్మిణీ.. 'కాంతార చాప్టర్ 1'తో పాన్ ఇండియా ప్రేక్షకులకు దగ్గరైంది. ప్రస్తుతం తన చేతిలో యశ్ టాక్సిక్, ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమాలు ఉన్నాయి. ఈ రెండు కూడా పాన్ ఇండియా రేంజ్ సినిమాలే.. ఇందులో ఆమె పాత్ర కూడా బలంగా ఉండబోతుందని తెలుస్తోంది.

## నేషనల్ క్రష్ గురించి

నేషనల్ క్రష్ ట్యాగ్‌లైన్ గురించి రుక్మిణీ ఇలా చెప్పింది. 'కొద్దిరోజుల నుంచి చాలా మంది నేషనల్ క్రష్ అంటూన్నారు. ఈ విషయం నా వరకు కూడా వచ్చింది. ఇలాంటివి వినడానికి మాత్రమే చాలా బాగుంటాయి. సంతోషాన్ని కూడా ఇస్తాయి. కానీ, ఇలాంటి ప్రశంసల గురించి నేను ఎక్కువగా ఆలోచించను. ఇలాంటివి ఏమైనా సరే తాత్కాలికంగానే ఉంటాయి. కాలంతో పాటు ఎందరో వస్తుంటారు.. అవి కూడా మారిపోతుంటాయని నేను నమ్ముతాను. కానీ, ప్రేక్షకులకు దగ్గరగా ఉంటే చాలనుకుంటాను. 'సప్తసాగరాలు దాటి' సినిమాతో చాలామంది నన్ను ప్రియ పాత్రతో పిలుస్తుంటారు. ఇలా ప్రేక్షకులకు చేరువయ్యితే చాలనుకుంటాను. చాలా సింప్లిసిటీతో కూడిన ఆ పాత్రను కూడా సినీప్రియులు ఆదరించినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది.'అని ఆమె అన్నారు.

# రహస్యంగానే విజయ్ దేవరకొండ, రష్మిక.. కారణం ఏంటి?



సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతుందనే విషయం తెలిసిందే. రీసెంట్‌గా అక్కినేని నాగార్జున కుటుంబంతో పాటు అల్లు అరవింద్ ఫ్యామిలీ నుంచి కూడా శుభవార్తలు విన్నాం. అయితే, తాజాగా విజయ్ దేవరకొండ (Vijay Deverakonda), రష్మిక (Rashmika Mandanna)లు నిశ్చితార్థం చేసుకున్నారు. ఇదే విషయాన్ని వారి సన్నిహిత వర్గాలు కూడా చెబుతున్నాయి. సోషల్‌మీడియాలో అయితే, పాన్ ఇండియా రేంజ్‌లో ఈ వార్తలు వైరల్ అయ్యాయి. కానీ, ఈ జోడీ మాత్రం తమకు ఏమ్ తెలియనట్లు సైలెంట్‌గా ఉంది. గతంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ ఐశ్వర్యరాయ్, దీపికా పదుకొణెలతో పాటు చాలామంది సెలబ్రిటీలు తమ పెళ్లి సందర్భం వచ్చినప్పుడు తమ అభిమానులతో పంచుకున్నారు. నేటి ప్రపంచంలో ఎవరూ కూడా తమ ప్రేమ,పెళ్లి విషయాల్ని దాచుకోవడం లేదు. సమయం వచ్చినప్పుడు చెప్పేస్తున్నారు. విజయ్ దేవరకొండ, రష్మికల నిశ్చితార్థం గురించి సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. మిలియన్ల కొద్ది శుభాకాంక్షలు చెబుతున్నారు. కానీ, ఈ జంట మాత్రం ఇలాంటి సమయంలో చాలా గుంభనంగా ఉంది. కనీసం ఇవన్ని రూమర్స్ మాత్రమే అని కూడా వారు తమ అభిమానులకు చెప్పలేదు. నిజమే అయితే, కనీసం తమ ఫ్యాన్స్‌కు కూడా చెప్పకుండా ఇలా చేయడం ఏంటి అంటూ కామెంట్లు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇద్దరూ ఒక లోకేషన్‌లో కనిపించడం చూశాం. విజయ్ ఇంట్లో రష్మిక ఫోటోలు దిగడం, పుట్టినరోజు సమయంలో ఒకే ప్రదేశానికి వెకేషన్ ప్లాన్ చేయడం వంటి సందర్భాలు ఉన్నాయి. అవన్నీ కూడా పలు ఫోటోలతో అభిమానులే డీకోడ్ చేశారు. ప్రేమ విషయాన్ని రహస్యంగా దాచారంటే తప్పులేదు. కానీ, నిశ్చితార్థం విషయాన్ని కూడా అంత సీక్రెట్‌గా ఉంచడం ఎందుకు అనే సందేహం అందరిలో వస్తుంది. రష్మిక రీసెంట్‌గా తన కొత్త సినిమా విడుదల తేదీ ప్రకటించింది కానీ నిశ్చితార్థం గురించి మాత్రం చెప్పలేదు. ఇలాంటి విషయాల్లో ఇంత రహస్యం అవసరమా అంటూ నెటిజన్లు పేర్కొంటున్నారు.

# 80's స్టార్స్ రీయూనియన్..



స్టార్ హీరోలందరూ ఒక్కచోటకు చేరారు. 80వ దశకంలో వెండితెరపై సందడి చేసిన అగ్రనటులందరూ ఒకేచోట కలిసి ఎంతో ఘనంగా రీయూనియన్ పార్టీ చేసుకున్నారు. 80's రీయూనియన్ అంటూ ప్రతి ఏడాది సెలబ్రిటీలందరూ ఒకేచోటకు చేరి సంతోషంగా గడుపుతారన్న విషయం తెలిసిందే! ఈ ఏడాది అక్టోబర్ 4న చెన్నైలో ఘనంగా గెట్ టు గెదర్ సెలబ్రేట్ చేసుకున్నారు. ఈసారి కోలీవుడ్ స్టార్ జంట రాజ్‌కుమార్ సేతుపతి శ్రీప్రియ తమ ఇంట్లోనే ఈ పార్టీని ఏర్పాటు చేశారు.

**31 మంది స్టార్స్**

టాలీవుడ్ నుంచి చిరంజీవి, వెంకటేశ్, నరేశ్ ఈ పార్టీలో పాల్గొన్నారు. కోలీవుడ్, మాలీవుడ్, సాండల్‌వుడ్, అలాగే బాలీవుడ్ నుంచి కూడా స్టార్స్ వచ్చారు. జాకీ ష్రాఫ్, మీనా, శరత్‌కుమార్, నదియా, రాధ, సుహాసిని, రమ్యకృష్ణ, జయసుధ, సుమలత, ఖుష్బూ, లిస్సీ, శోభన, మేనక, సురేశ్, భాను చందర్, ప్రభు, రెహ్మాన్, రేవతి తదితరులు ఈ వేడుకలో సందడి చేశారు. దాదాపు 31 మంది నటీనటులు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈసారి చిరుత థీమ్ ప్లాన్ చేశారు. అందరూ చీతా ప్రింట్స్ ఉన్న డ్రెస్సులోనే మెరిశారు.

**మొదటిసారి కలిసినట్లే ఉంది: చిరు**

80s స్టార్స్ రీయూనియన్‌కు సంబంధించిన ఫోటోలను మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో షేర్ చేశారు. 80's స్నేహితులతో ప్రతి రీయూనియన్ మధుర జ్ఞాపకాల వీధిలో ఒక నడకలా ఉంటుంది. నవ్వులు, ఆప్యాయత, పాత జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆనందం, ప్రేమతో గడుస్తుంది. ఎన్ని సార్లు కలిసినా, ప్రతి సారి కొత్తగా, మొదటిసారి కలిసినట్టే సంతోషంగా అనిపిస్తుంది అన్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

**అప్పుడు మొదలైంది**

80's స్టార్స్ రీయూనియన్ 2009లో ప్రారంభమైంది. లిస్సీ, సుహాసిని తొలిసారి ఈ పార్టీ ఏర్పాటు చేశారు. 2019లో మెగాస్టార్ చిరంజీవి తన నివాసంలో 10వ రీయూనియన్ పార్టీ నిర్వహించారు. 2022లో చివరిసారి గెట్ టు గెదర్ జరిగింది. అప్పుడు బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్, నటి పూనమ్ ధిల్లాన్ పార్టీ హోస్ట్ చేశారు. 2023లో రీయూనియన్ జరగలేదు. 2024లో చెన్నైలో వరదల కారణంగా పార్టీ వాయిదా వేశారు. ఇన్నాళ్లకు మళ్లీ పార్టీ చేసుకుని ఎంజాయ్ చేశారు. పార్టీలో సరదా ఆటలు, పాటలు, డ్యాన్సులు ఉండనే ఉంటాయి. ఇలా ప్రతి ఏడాది జరగే ఈ "80s Stars Reunion" స్నేహం, ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వం విలువలకు ప్రతీకగా నిలుస్తోంది.






# జాక్వెలిన్ ఫెర్నాండేజ్ అందం చూడతరమా..?

గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ ఇండియావైడ్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న భామల్లో ఒకరు జాక్వెలిన్ ఫెర్నాండేజ్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త లుక్స్‌లో కనిపిస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తుంటుంది. లండన్ ఫ్యాషన్ వీక్ అనామిక ఖన్నా AK|OK runway షోలో హొయలు పోతూ కెమెరాకు ఫోజులిచ్చిన జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తాజాగా మరో ఈవెంట్‌లో తళుక్కున మెరిసింది. ఈసారి పారిస్ ప్యాషన్ వీక్ 2025లో బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో సందడి చేసింది. జాక్వెలిన్ ఫెర్నాండేజ్ వేలాడుతున్న హియర్ రింగ్స్‌తో చేతిలో హ్యాండ్ పర్స్ పట్టుకొని లైటింగ్స్ మధ్య హొయలు పోతూ కెమెరాలకు ఫోజులిచ్చింది. బ్లాక్ డ్రెస్‌లో నక్షత్రంలా మెరిసిపోతూ కుర్రకారు మతులు పోగొడుతోంది. కిక్, రేస్, రైడ్, వెల్‌కమ్, హౌస్‌ఫుల్ సినిమాలతో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న జాక్వెలిన్ త్వరలో తెలుగులో ఓ సినిమా చేసేందుకు రెడీ అవుతుందంటూ సోషల్ మీడియాలో ఓ వార్త హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ భామ టాలీవుడ్ డైరెక్టర్‌తో ఫీ మేల్ సెంట్రిక్ సబ్జెక్టుతో ఓ సినిమా చేసేందుకు రెడీ అయిందని తెలుస్తుండగా.. దీనిపై రానున్న రోజుల్లో ఏమైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి.

# భర్త మహాశయులకు విజ్ఞప్తి!

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అని అంటున్నారట హీరో రవితేజ. ఈ విజ్ఞప్తి వివరాల కోసం ప్రేక్షకులను వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌కి రమ్మంటున్నారు. రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి తొలుత 'అనార్కలి' అనే టైటిల్‌ను అనుకున్నారు. కానీ తాజాగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, త్వరలోనే ఈ సినిమా టైటిల్ గురించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ కోసమే రవితేజ స్పెయిన్ వెళ్లారు. కొంత టాకీ పార్టు, రెండు పాటల చిత్రీకరణ స్పెయిన్ లొకేషన్స్‌లో జరుగుతుంది. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుంది. ఇక ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com